



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 248 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 17 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 248 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 17 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..

### ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు



- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది.

వివరాలు 2లో..



పోతురాజుల విన్యాసాలు | శివసత్తుల పూనకాలు | భక్తిగీతాల ఆలాపనలు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది

## కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ కోతలు

- అప్రకటిత కరెంటు కోతలతో అంధకారం
- ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎందుకు పంపిస్తున్నారు?
- సర్కారుకు హరీశ్‌రావు ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అంధకారంలోకి వెళ్లే పరిస్థితి నెలకొందని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. అప్రకటిత కరెంట్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గురువారం రాష్ట్రంలోని 11 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేశారని.. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్లే కరెంట్ కోతలని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు."థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు లేవని మేం ముందే చెప్పాం. కానీ, 40 లక్షల టన్నుల బొగ్గు ఉందని ప్రభుత్వం అవాస్తవాలు చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ఇప్పుడు పలు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయింది.

- మిగతా 2లో

## గాంధీ భవన్ లో పాలాభిషేకం నిషేధం



- పార్టీ కార్యక్రమాల్లో పాలభిషేకాలు, జలాభిషేకాలపై టీపీసీసీ నిషేధం
- జేసీబీలు, బుల్డోజర్లతో నేతలకు భారీ గజమాలలు వేయడం నిలిపివేత
- ఆహార వృథాను నివారించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిక

- మిగతా 2లో



## వీలైనంత వేగంగా వినియోగంలోకి కాళేశ్వరం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి 'సీతమ్మ సాగర్' పరిశీలన

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం బ్యారేజీలకు వీలైనంత త్వరగా మరమ్మతు చేయించి... వినియోగంలోకి తెస్తామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి స్పష్టం చేశారు. "మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఎన్డీఎస్ఏ(నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదిక ఇచ్చింది. ఆ మేరకు నిపుణులతో మట్టి, ఇతర పరీక్షలు చేయిస్తున్నాం. వాటి ఫలితాల ఆధారంగా ఎంత ఖర్చయినా మరమ్మతు చేయిస్తాం" అని పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టును, సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో నిర్మించిన సొరంగాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ... "భారాస హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయింది.

- మిగతా 2లో



## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

### కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

**పెన్ పవర్ డెస్క్:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని

- మిగతా 2లో



## డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

- మంగళ్‌హాట్‌లో డ్రగ్స్ ముఠాపై పోలీసుల దాడి
- ఎమ్మెల్సీ కుమారుడితో సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు ఐఏఎన్ఎస్ కథనం
- వారి నుంచి హ్యాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం
- తన కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని ఖండించిన ఎమ్మెల్సీ
- కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నలుగురి కోసం గాలింపు

- మిగతా 2లో

## సొంత పార్టీ నేతపై వేటు..

### అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

- తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావు లేదన్న విజయ్
- ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని వెల్లడి
- అవినీతికి పాల్పడేవారికి రెండో ఛాన్స్ ఉండదని స్పష్టీకరణ

2లో



## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట.. ఇద్దరు మృతి, 100 మందికి పైగా గాయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర లో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా భక్తులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. 100 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఒకరిని కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. మరోకరి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు, అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.


## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- కుడంకుళం అణు కేంద్రం నుంచి సున్నితమైన డేటా ఏదీ లీక్ కాలేదని స్పష్టీకరణ
- ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన అవసరం లేదని వెల్లడి
- గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం ఉండదని హామీ
- డేటా లీక్ కాంట్రాక్టర్ సర్వర్‌లో జరిగిందని తెలిపిన మంత్రి జితేంద్ర సింగ్

- మిగతా 2లో

## యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు..



### కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

- ఇంధన రంగ నిపుణుడైన కోరెట్స్కీని ఎంపిక చేసిన జెలెన్స్కీ
- కోరెట్స్కీ నియామకానికి ఆమోదం తెలిపిన ఉక్రెయిన్ పార్లమెంట్
- రక్షణ దళాల బలోపేతం, శీతాకాల సన్నద్ధతే ప్రధాన లక్ష్యాలు

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

## అగ్రరాజ్యం ముప్పేట దాడి

అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం మరింత తీవ్ర స్థాయికి చేరబోతోంది. హోర్ముజ్ జలసంధి గుండా ఇరాన్ రాకపోకలను అమెరికా అడ్డుకుంది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌పై అమెరికా నావికా దళాలు దిగ్బంధనం చేశాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీని అర్థం, ఇరాన్ నౌకలు ఇకపై హోర్ముజ్ జలసంధిని దాటలేవు. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఈ ఘర్షణను మరింత తీవ్ర స్థాయికి తీసుకువెళ్లవచ్చు. యూఎస్ సెంట్రల్ కమాండ్ శలో ఒక పోస్ట్‌ను షేర్ చేసింది. అందులో ఇలా పేర్కొంది, "ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతాల్లోకి ప్రవేశించే, బయలుదేరే నౌకలపై అమెరికా సైన్యం సముద్ర దిగ్బంధనాన్ని పునఃప్రారంభించింది. ప్రస్తుతం 20కి పైగా యూఎస్ నేవీ యుద్ధనౌకలు, వందలాది సైనిక విమానాలు మధ్యప్రాచ్యంలో మోహరించి ఉన్నాయి."అమెరికా మొదట ఏప్రిల్‌లో ఇరాన్‌పై దిగ్బంధనాన్ని విధించి, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే జూన్‌లో దానిని ఎత్తివేసింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల్లోగా ఇరాన్ అణు కార్యక్రమంపై శాశ్వత ఒప్పందానికి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు, కానీ హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చర్చలు ముందుకు సాగలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం దిగ్బంధనాన్ని తిరిగి విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మొదట హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై 20 శాతం సుంకం విధించాలని ప్రతిపాదించినప్పటికీ, ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన వాణిజ్య మార్గాలలో ఒకటి. యుద్ధానికి ముందు, ప్రపంచంలోని ముడి చమురు, గ్యాస్‌లో సుమారు 20 శాతం దీని ద్వారా వర్తకం జరిగేది. అయితే, అమెరికా–ఇరాన్ యుద్ధం ఈ మార్గాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఫలితంగా, యుద్ధం తర్వాత అనేక దేశాలలో చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి

**మళ్లీ ఇరాన్ నిర్బంధమే.. డొనాల్డ్ ట్రంప్**

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాలుస్తూ అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని పక్కనబెట్టి, ఇరాన్‌ను తమ నౌకాదళంతో మళ్లీ దిగ్బంధించబోతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దిగ్బంధం కేవలం ఇరాన్ నౌకలు, వారి ఖాతాదారుల రాకపోకలను మాత్రమే అడ్డుకుంటుందని, ఇతర దేశాల వాణిజ్య నౌకలు హర్మ్యాజ్ జలసంధిని యథావిధిగా వాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఇకపై అమెరికానే ఈ జలసంధికి సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిష్పక్షపాత భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే ఖర్చుల కోసం అక్కడ ప్రయాణించే అన్ని రకాల వాణిజ్య నౌకల సరకు విలువపై 20 శాతం చొప్పున పన్ను లేదా టోల్ వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సుంకాల వసూలు ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుందని, అమెరికా రక్షణలోనే హర్మ్యాజ్ ఎప్పటికీ సురక్షితంగా తెరిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య కత్తులు దూసుకుంటున్న ఈ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..

# ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

- మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ కోతలు

- మొదటి పేజీ తరువాయి

కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లలో 6–7 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవు. యాదాద్రి ప్లాంట్‌లో యూనిట్–1, యూనిట్–4లలో బొగ్గు లేక ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. భద్రాద్రి ప్లాంట్‌లో నిర్వహణ వైఫల్యంతో ఉత్పత్తి ఆగిపోయింది. తెలంగాణకు మొత్తంగా 23 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉంది. అయినా ప్రస్తుతం 3,190 మెగావాట్లే ఉత్పత్తి అవుతోంది. దీనికి కారణమేంటో ప్రభుత్వం చెప్పాలి. అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఆ భారం వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు ఎందుకు భరించాలి? నాణ్యమైన సింగరేణి బొగ్గును తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు పంపుతున్నారు. తెలంగాణలో అవసరాలకు మాత్రం నాణ్యత లేని బొగ్గు పంపిస్తున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కంటి నిండా నిద్రపోయిన రైతులకు ఇప్పుడు కునుకు కరవైంది. లోవోల్టేజ్, మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం వంటి సమస్యలతో వారు సతమతమవుతున్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఉమ్మడి రాష్ట్రం నాటి విద్యుత్ కష్టాలను మళ్లీ తీసుకురావడమేనా? గ్రీన్‌ఎనర్జీ పాలసీ తీసుకొచ్చిన తర్వాత 3 వేల మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకుంటే.. ఇప్పటివరకు ఆ దరఖాస్తులు ఎందుకు క్లియర్ చేయలేదు? వెంటనే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి. రాష్ట్రంలోని రైతులందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో పోలీసులు జరిపిన దాడిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పి. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, తన కుమారుడు డ్రగ్స్ వినియోగించలేదని, అతడిని అరెస్ట్ చేయలేదని ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ కథనం మేరకు.. బుధవారం రాత్రి మంగళ్‌హాట్‌లో ఓ ముఠా గంజాయి, హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి సేవిస్తోందని తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, యునిత్‌లను పట్టుకోగా, మరో నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల హ్యాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సోని, వంశీ, మనోజ్, తులిజాల కోసం గాలిస్తున్నారు.

కాగా, ఈ ఆరోపణలను ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నాడని, అతడిని అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. "ఒక కామన్ ఫ్రెండ్ ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో నంబర్ ఉండటంతో, డ్రగ్స్ కేసుకు సంబంధించి విచారణకు సహకరించాలని పోలీసులు మా ఇంటికి వచ్చారు. విచారణలో నా కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. అతడిని అరెస్ట్ చేయలేదు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రగ్స్ కేసులు నమోదవుతుండటంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

# గాంధీ భవన్ లో పాలాభిషేకం నిషేధం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లకు పాలభిషేకాలు, జలాభిషేకాలు చేయడాన్ని పూర్తిగా నిషేధించింది. అలాగే, జేసీబీలు, బుల్డోజర్లు వంటి భారీ యంత్రాల సహాయంతో నాయకులకు గజమాలలు వేయడాన్ని నిలిపివేస్తూ గురువారం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమైన ఇటువంటి పద్ధతులకు స్వస్తి పలకాలని స్పష్టం చేసింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్‌రావు ఈ సర్క్యులర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "దేశంలో ఎందరో పోషకాహార లోపంతో బాధపడుతున్న తరుణంలో, పాలను వృథా చేయడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, ఆశయాలకు పూర్తిగా విరుద్ధం" అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఇటువంటి ఆడంబరాలకు బదులుగా పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అంతేకాకుండా, సీనియర్ నేతల పర్యటనల సందర్భంగా జేసీబీలు, బుల్డోజర్లతో భారీ దండలు వేయడాన్ని కూడా తీవ్రంగా పరిగణించారు. ఈ యంత్రాలను 'అణచివేతకు చిహ్నాలు'గా పార్టీ అభివర్ణించింది. అనవసర ఆడంబరాలకు దూరంగా ఉంటూ, ప్రజాసేవ, నిరాడంబరత అనే పార్టీ మూల సూత్రాలకు కట్టుబడి ఉండాలని ఆదేశించింది. రాజకీయాల్లో పాలాభిషేకాలు, గజమాలల సంప్రదాయం విస్తృతంగా ఉన్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వీలైనంత వేగంగా వినియోగంలోకి కాళేశ్వరం

- మొదటి పేజీ తరువాయి

అందులో నీటిని నిల్వ చేయొద్దంటూ ఎన్డీఎస్ఏ లిఖితపూర్వకంగా తెలిపింది. విస్మరిస్తే మేడిగడ్డ తరహాలోనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కూలిపోతాయని హెచ్చరించింది. భారాసకున్న కమీషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం దెబ్బతింది. పాలమూరు–రంగారెడ్డిపై రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకైనా నీళ్లివ్వలేదు. భారాస అధికారంలోకి వచ్చిన రోజు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ... వారు దిగిపోయే రోజు కూడా అలాగే ఉన్నాయి. రాష్ట్రంలో వారు పూర్తి చేసిన ప్రాజెక్టు ఒక్కటీ లేదు. తుమ్మిడిహెట్టిపై చర్చించేందుకు వారం రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టితో కలిసి మహారాష్ట్రకు వెళ్తున్నాం" అని వివరించారు.

**గోదావరి సద్వియోగం కోసం...**

ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ... "గోదావరిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత వరకు ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రాజెక్టుల్ని సందిర్శించి, సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా ప్రణాళిక రూపొందించాం. గతంలో కాంగ్రెస్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌ల ద్వారా 4 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనుకున్నాం. అప్పట్లో రూ.3,500 కోట్లతో వాటి పనులు మొదలుపెట్టాం. భారాస అధికారంలోకి వచ్చాక రీడిజైన్ చేసి... వ్యయాన్ని రూ.24 వేల కోట్లకు పెంచారు. రూ.8 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టారు. మేం అధికారంలోకి వచ్చాక సుదీర్ఘంగా చర్చించాం. వారు తప్పులు చేసినా ప్రాజెక్టు ఆపడం సరికాదని భూసేకరణతోపాటు పెండింగ్ బిల్లులు ఇచ్చి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాం' అని వెల్లడించారు.

**వారి తప్పిదాలను సరిదిద్దుతున్నాం**

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... "జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని అప్పటి సీఎం వైఎస్ రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌ను ప్రారంభించారు. భారాస వచ్చాక ప్రాజెక్టులన్నింటినీ రీడిజైన్ చేశారు. మేం పట్టుదలకు పోకుండా వారు చేసిన తప్పుల్ని సరిదిద్దుతున్నాం. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల్ని సరిచేస్తున్నాం" అని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వేంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, రామదాసునాయక్, మట్టా రాగమయి, ఆదినారాయణ, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్లు అంకిత్, దివాకర్, నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

## కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు.

ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్–పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక ద సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

## సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు. ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.






# లక్ష మంది సామర్థ్యంతో ‘ఫ్యూచర్’లో స్టేడియం

- టీజీ20కి ఐపీఎల్ స్థాయి గుర్తింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌కు అభినందన
- యువ క్రికెటర్లు సచిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన

- మిగతా 4లో...


**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామీణ ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడానికి టీజీ20 లీగ్ మంచి వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ‘తెలంగాణలో తొలిసారిగా టీజీ20 లీగ్ జరిగింది. ఈనాడు సంస్థ ప్రోత్సహించడమంటే ఆటగాళ్లకు వెయ్యేనుగుల బలం వచ్చినట్లే. అలాంటి సంస్థ అండగా నిలవడంతో ఈ లీగ్‌కు దాదాపుగా ఐపీఎల్ స్థాయి గుర్తింపు లభించింది’ అని ప్రస్తుతించారు. రాష్ట్రంలోని యువ ఆటగాళ్లను ప్రోత్సహించడానికి ఫ్యూచర్ సిటీలో లక్ష మంది సామర్థ్యంతో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు బీసీసీఐ, హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ)తో చర్చిస్తున్నట్లు చెప్పారు. టీజీ20 మొదటి సీజన్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌ను సీఎం రేవంత్ అభినందించారు.

గురువారం ఎంసీహెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆయన సత్కరించారు. రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఉషాకిరణ్ మూవీస్ డైరెక్టర్ బాపినీడు, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, కెప్టెన్ అభిరథ్‌రెడ్డి, చీఫ్ కోచ్ అనిరుధ్‌సింగ్‌తో పాటు జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి ‘ఈనాడు’ ప్రకటించిన రూ.1 కోటి నగదు ప్రోత్సాహకాల్ని సీఎం రేవంత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సీఎం రేవంత్‌రెడ్డితో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్, ఉషాకిరణ్ మూవీస్ డైరెక్టర్ బాపినీడు, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, దివిజ, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, రమ, జట్టు కెప్టెన్ అభిరథ్‌రెడ్డి, చీఫ్ కోచ్ అనిరుధ్‌సింగ్, ఈ ఛాంపియన్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు పతకం సాధిస్తే నగదు బహుమతి.. ఉద్యోగం నేరుగా వచ్చేస్తాయ్

# హైదరాబాద్ స్కూల్‌లో వివాదం.. హిందూ విద్యార్థికి ‘కల్మా’ హోంవర్క్

- హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో హిందూ విద్యార్థికి ఇస్లామిక్ హోంవర్క్
- ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థి తల్లిదండ్రులు.. టీచర్‌ను తొలగించిన యాజమాన్యం
- ఇది పొరపాటున జరిగిందని.. అయినా చర్యలు తీసుకున్నామని స్కూల్ వివరణ
- ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం.. ప్రభుత్వంపై విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తీవ్ర వివాదం చెలరేగింది. రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి ఇస్లామిక్ మతానికి సంబంధించిన సూరాలను హోంవర్క్‌గా ఇవ్వడం ఈ వివాదానికి కారణమైంది. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాఠశాల యాజమాన్యం స్పందించి, అందుకు బాధ్యురాలైన టీచర్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. వివరాల్లోకి వెళితే.. సైదాబాద్ ప్రాంతంలోని ‘సక్సెస్’ అనే ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థికి నిన్న ‘దీనియాత్’ సబ్జెక్టు కింద ‘సూరా ఫాతిహా’ చదవాలని స్కూల్ డైరీలో హోంవర్క్ రాశారు. అంతకుముందు ఈ నెల 11న ‘కల్మా’ చదవాలని రాసి, అది ముస్లింయేతర విద్యార్థి అని గ్రహించి టీచర్ దానిని కొట్టివేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించి తీవ్ర నిరసన తెలిపారు. విద్యాసంస్థలో ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తల్లిదండ్రుల నిరసనతో పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించింది. ఇది పొరపాటున జరిగినప్పటికీ, ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో ‘సక్సెస్’ విద్యాసంస్థల గ్రూపులో ఆమె ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోకుండా అనర్హురాలిగా ప్రకటించారు. తమ పాఠశాలలో ఎక్కువ మంది ముస్లిం విద్యార్థులు ఉన్నారని, వారికి ‘దీనియాత్’ (ఇస్లామిక్ బోధన) సబ్జెక్టు ఉంటుందని, అయితే ఆ సబ్జెక్టును ఇతర మతాల విద్యార్థులకు బోధించమని యాజమాన్యం వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. రెండో తరగతి విద్యార్థిపై ‘కల్మా’ చదవాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. “తెలంగాణలో ఇలాంటి ఘటనలు కొత్తేమీ కాదు. గతంలోనూ చాలా జరిగాయి. హిందూ పిల్లాడిని కల్మా చదవాలని ఎలా ఒత్తిడి చేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే, స్కూల్ యాజమాన్యం వద్ద సమాధానం లేదు,” అని ఆయన పేర్కొన్నారు. హిందూ విద్యార్థులను బలవంతం చేస్తున్న ఇలాంటి పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎందుకు మౌనంగా ఉన్నారని రాజాసింగ్ ప్రశ్నించారు.



# 9 నెలల్లో కొత్త లుక్.. నాచారం చెరువు సుందరీకరణ షురూ

- నాచారం పెద్ద చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభం
- రూ.28 కోట్ల వ్యయంతో 9 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక
- చెరువు అభివృద్ధి ద్వారా వరద ముంపు సమస్యకు పరిష్కారం

- మిగతా 4లో...




# ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

## బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

- మిగతా 4లో...



# సక్సెస్ స్కూల్‌లో ‘కల్మా’ కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

- సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన
- ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్
- డైరీని గమనించి షాక్ కు గురైన తల్లిదండ్రులు
- స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి ‘సక్సెస్ స్కూల్’లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన ‘కల్మా’, ‘సూరహ్ అల్-ఫాతిహా’ చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు

- మిగతా 4లో...



# సైబర్ నేరాల నమోదులో ఏఐ సేవలు: డీజీపీ

**హైదరాబాద్ పెన్ పవర్:** సైబర్ నేరాల నమోదులో వేగవంతమైన సేవల్ని అందించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సేవల్ని విస్తరించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐ ఆధారిత కాల్‌సెంటర్‌ను పరిశీలించారు. ఓ బాధితురాలు ఫోన్ చేసి సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయానని చెప్పగానే..

- మిగతా 4లో...

# లక్ష మంది సామర్థ్యంతో 'ఫ్యూచర్'లో స్టేడియం

- 3 పేజి తరువాయి

"యువ క్రికెటర్లు సచిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. సచిన్, సునీల్ గావస్కర్, ధోని, విరాట్ కోహ్లీ లాంటి ఆటగాళ్లు క్రికెట్ పట్ల చూపించిన గౌరవం, అంకితభావం వల్లే చరిత్రలో నిలిచిపోయారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్‌లో జాతీయ క్రీడలు, ఆఫ్రో-ఆసియా క్రీడలు సహా ప్రతిష్ఠాత్మక పోటీలు జరిగాయి. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో భారత్‌కు నాలుగో స్థానం వచ్చినప్పుడు కూడా హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం ఉండేది. గత కొంతకాలంగా హైదరాబాద్ క్రీడలకు దూరమైంది. మా ప్రభుత్వం వచ్చాక క్రీడలపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. అద్భుతమైన క్రీడా విధానాన్ని తీసుకొచ్చాం. ప్రతిభావంతులు, పతక విజేతలు ఎవరి దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదు. పతకం సాధిస్తే నగదు బహుమతి, ఉద్యోగం నేరుగా వచ్చేస్తాయి. క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హతలు లేకపోయినా నిబంధనల్ని సడలించి డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూపు-1, జీవాంజి దీప్తికి గ్రూపు-2 ఉద్యోగాలు అందించాం. ఇషా సింగ్‌కు రూ.3 కోట్ల నగదు బహుమతి ఇచ్చాం. క్రీడల్లో రాణించే వారికి రివార్డులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. స్పోర్ట్స్ యూనివర్సిటీని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అత్యాధునిక వసతులతో పునరుద్ధరిస్తున్నాం. రెండేళ్లలో ఒలింపిక్ ప్రమాణాలతో అకాడమీని, శిక్షణ కేంద్రాన్ని అన్ని వసతులతో అందుబాటులోకి తెస్తాం.

**కొంచెం గుర్తింపు రాగానే ఏకాగ్రత కోల్పోకూడదు**

ఏ వృత్తిలో అయినా ఏకాగ్రత చాలా ముఖ్యం. చేసే పని పట్ల గౌరవం ఉన్నప్పుడే రాణిస్తారు. కొంచెం గుర్తింపు రాగానే ఏకాగ్రత కోల్పోకూడదు. ముఖ్యంగా క్రికెట్లో సెలబ్రిటీ హోదా రాగానే ఆట వెనక్కిపోయి ఇతర విషయాలు ముందుకొస్తాయి. మైదానంలో రాణించాలంటే దేహానికి సరైన విశ్రాంతి అవసరం. రాత్రిపూట సరైన నిద్రలేకపోతే మైదానంలో పరుగెత్తలేరు. జట్టు గెలిచినా, ఓడినా వ్యక్తిగత ప్రతిభను చాటుకోవడానికి సువర్ణావకాశం. తెలంగాణలోని యువ క్రికెటర్లంతా దేశ ప్రతిష్ఠను పెంచే గొప్ప క్రీడాకారులుగా తయారవుతారని ఆశిస్తున్నా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్టును గాలికి వదిలేశారు

-3 పేజి తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు.

"గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్టును వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టును కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్టులకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్టుకు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం

నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# సైబర్ నేరాల నమోదులో ఏఐ సేవలు: డీజీపీ

-3 పేజి తరువాయి

ఏఐ వ్యవస్థ స్పందించి ఫిర్యాదు వివరాలను సేకరించి సంబంధిత ఠాణాకు చేరవేసే విధానాన్ని పర్యవేక్షించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నమోదైన సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన ఆర్థిక నష్టం 2024తో పోల్చితే గతేడాది 20 శాతం మేర తగ్గిపోవడంతో పాటు ఫిర్యాదులు 3 శాతం తగ్గడం నేర నియంత్రణకు నిదర్శనమన్నారు. సమావేశంలో బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్, ఎస్పీలు హర్షవర్ధన్, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**సేఫ్ సిటీ ప్రాజెక్టుతో మరింత మెరుగైన భద్రత..**

సేఫ్ సిటీ ప్రాజెక్టును సమర్థంగా అమలు చేయడం ద్వారా పౌరుల భద్రత మరింత మెరుగవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలను సమర్థంగా వినియోగిస్తూ నేరాల నివారణ చర్యల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. సమావేశంలో డీజీలు మహేశ్‌భగవత్, చారుసిన్హా, పోలీస్ కమిషనర్లు వీసీ సజ్జనార్, రమేశ్‌రెడ్డి, సుమతి, తరుణ్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

# 9 నెలల్లో కొత్త లుక్.. నాచారం చెరువు సుందరీకరణ షురూ

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధిలో గల నాచారం పెద్ద చెరువు పునరుజ్జీవం పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను తొమ్మిది నెలల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు.

సుమారు 108.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా చెరువులో 10 అడుగుల లోతు వరకు పూడిక తీయడం, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, కట్టను పటిష్ఠం చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. కట్టపై పాదచారుల మార్గాలు, ల్యాండ్‌స్కేప్ పార్కులు, చిన్నారుల కోసం ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు, యోగా వేదికలను ఏర్పాటు చేయనున్నారు.

స్థానికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలకు ఈ ప్రాజెక్టు ద్వారా పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు. చెరువులోకి మురుగునీరు చేరడం, దుర్వాసన, దోమల బెడదతో పాటు సమీప కాలనీల్లో వరద ముంపు సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల భూగర్భ జలమట్టం కూడా మెరుగుపడుతుందని వివరించారు.

అనంతరం, కమిషనర్ రంగనాథ్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్‌లోని నాగిరెడ్డి కుంటను సందర్శించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో, ప్రభుత్వ భూముల్లో కబ్జాలు జరుగుతున్నాయని, వరద కాలువలను పూడ్చివేయడం

వల్ల తమ కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కమిషనర్, ఆక్రమణలను తొలగించి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం.. కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్

-3 పేజి తరువాయి

హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది.ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# స్వదేశీ సాంకేతికతతో సరికొత్త బై మెటాలిక్ నిర్మాణం

**రూపొందించిన ఏఆర్‌సీఐ శాస్త్రవేత్తలు**

**లేజర్ సాంకేతికతతో త్రీడీ ప్రింటింగ్‌లో రూపొందించిన ద్విలోహం**

హైదరాబాద్ పెన్ పవర్: వైమానిక, అణుశక్తి, థర్మల్ పవర్ ప్లాంట్ల వంటి కీలక రంగాల్లో ఉపయోగించే ఖరీదైన సూపర్ అలాయ్‌ల దిగుమతుల భారాన్ని గణనీయంగా తగ్గించే దిశగా హైదరాబాద్ పరిశోధకులు విజయాన్ని సాధించారు. పూర్తి స్వదేశీ సాంకేతికతతో సరికొత్త ద్విలోహ (బై మెటాలిక్) నిర్మాణాన్ని రూపొందించారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. సాధారణంగా గ్యాస్ టర్బైన్లు, అణు రియాక్టర్లు, పవర్ ప్లాంట్లలో కొన్ని భాగాలు దాదాపు 2వేల డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలకు గురవుతుంటే.. పక్కనే ఉండే ఇతర భాగాలు తక్కువ ఉష్ణోగ్రత వద్ద పనిచేస్తాయి. ఇలాంటి చోట్ల స్టెయిన్‌లెస్ స్టీల్ బలంగా ఉంటుంది. విపరీతమైన వేడిని నికెల్ ఆధారిత ఇన్‌కోనెల్ సూపర్ అలాయ్ తట్టుకుంటుంది. ఈ రెండింటిని కలిపి ఒకే భాగంగా తయారు చేస్తే ఎంతో ప్రయోజనకరం. అయితే ఈ రెండు లోహాలకు ఎస్ఎస్316ఎల్, ఐఎన్718 కలపడం చాలా కష్టం. పగుళ్లు రావడం, రంధ్రాలు పడడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ సవాల్‌ను అధిగమించడానికి ఎస్.నారాయణస్వామి, గురురాజ్, నోకున్ పార్క్, రవి బాతేలతో కూడిన ఏఆర్‌సీఐ పరిశోధక బృందం.. లేజర్ బేస్డ్ పౌడర్ బెడ్ ఫ్యూజన్ అనే అడ్వాన్స్‌డ్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ పద్ధతిని ఉపయోగించింది. ఫలితంగా పగుళ్లు, రంధ్రాలు ఏవి లేకుండా అత్యంత పటిష్ఠమైన ద్విలోహ నిర్మాణాన్ని రూపొందించగలిగారు.

# ఓట్లు గల్లంతయితే మీదే బాధ్యత

**డీసీసీలు, పార్లమెంటు పర్యవేక్షకులకు మీనాక్షి హెచ్చరిక**



హైదరాబాద్ పెన్ పవర్: అర్హులైనవారి ఓటు ఒక్కటి గల్లంతయినా ఆ బాధ్యత జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లు, పార్లమెంటు నియోజకవర్గ పర్యవేక్షకులదేనని, వాటిని తొలగించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హెచ్చరించారు. గురువారం గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షులు, పార్లమెంటు పర్యవేక్షకులతో వేర్వేరుగా ఆమె సమావేశమై తెలంగాణలో సర్ కార్యక్రమం అమలుతీరు, పార్టీ నేతల పనితీరుపై వివరాలు అడిగి పలు సూచనలిచ్చారు. ఎక్కడైనా అర్హులైన ఓటర్ల ఓట్లను తొలగిస్తే ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

# భద్రకాళి దేవస్థానంలో శాకంబరి నవరాత్రి నవరాత్రి ఉత్సవాలు. ప్రారంభం



హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఈ రోజు (దివి: 15-07-2026 బుధవారం) అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గం॥ 04-30లకు నిత్యాహ్నికం పూర్తయిన పిమ్మట అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్ధన జరిపి అమ్మవారి నుండి అనుమతి వచ్చిన మేరకు ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ పూర్వాంగవిధి అర్చకులు నిర్వహించారు. ఉదయం గం॥ 10-00లకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి-నీలిమ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ఎంతో వైభవంగా ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన ఎం.ఎల్.ఏ శ్రీ రాజేందర్ రెడ్డికి ఆలయ ఈ.ఓ రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

అనంతరం అర్చకులు సహస్ర కలశాభిషేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గ్రహమఖం మూలమంత్ర హటరీమం, శాంతి హటరీమం నిర్వహించిన తదుపరి అమ్మవారికి దాదాపు 2 గంటల సేపు 1008 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అభిషేకం జరుగుతున్నంతసేపు భక్తులు తన్మయత్వంతో ఒక దివ్యానుభూతిని పొందారు. భక్తులంతా సహస్ర కలశాభిషేక అనుభూతిని ఒకరితో మరియొకరు పంచుకున్నారు. అనంతరం అమ్మవారి షడ్బేరాలలో అమ్మవారి ఎదురుగా ఉన్న బేరాన్ని (మూర్తి) కాళీ మాతగా, మహామండపంలోని బేరాన్ని కామేశ్వరీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. రాత్రి గం॥ 08-30ని॥లకు నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణతో ఈ రోజు కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ రోజు సహస్ర కలశాభిషేకానికి శ్రీ బాసాని విశ్వప్రకాశ్-శోభ దంపతులు, డా॥ సాయివిక్షిత్-డా॥ నిహంతి, కావ్యత్, శ్రీ కంచనకుంట్ల సాంబశివరెడ్డి - వినోద దంపతులు మరియు కంచనకుంట్ల శ్రీధర్రెడ్డి- కీర్తి దంపతులు దాతలుగా వ్యవహరించారు. అట్లాగే శాకంభరీ నవరాత్ర తిథిమండల దేవతాయాగ దాతలు శ్రీ కాకిరాల నరసింహారావు- ఇందిర దంపతులు, డా॥ సంతోష్ శ్రీకాంత్-డా॥ రిదిమ దంపతులు, కౌటిల్య, డా॥ పోతాని రాజేశ్వరప్రసాద్-డా॥ లలితా దేవి దంపతులు అంతేగాక అనేకమంది వ్యాపార ప్రముఖులు మరియు వివిధ రంగాల ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొన్నారు. అంతేగాక అనేకమంది వ్యాపార ప్రముఖులు మరియు వివిధ రంగాల ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొన్నారు.


# వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు.సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్పాఠశాల ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. మైదానంలో చెట్లు ప్రశాంతమైన వాతావరణం బాగుందని ప్రిన్సిపల్ ను అభినందించారు.పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు.గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు.

సబ్జెక్టులో ఏదైతే రాదన్న టాపిక్ పలు మార్లు చదివితే రానీదంటూ ఏదీ ఉండదని, సమయాన్ని వృధా చేయవద్దని పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లును అలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించిఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని, భయపడుతూ, సార్ ఏమంటారో, అని వెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు.

పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.






## విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్స్టేషన్ను ముట్టడించిన రైతులు

**సూర్యాపేట: పెన్ పవర్:** మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామ సబ్స్టేషన్ వద్ద రైతులు ఆందోళన కు దిగారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్స్టేషన్ను ముట్టడించారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని, వేసిన పంటలు కరెంటు లేక ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కోతలు లేని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేసారు.

## లక్క పురుగుల బెడద.. రైతుల ఆందోళన

**కామారెడ్డి: పెన్ పవర్:** రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామంలో గోదాముల ఎదుట గ్రామస్తులు బైఠాయించారు. గోదాముల నుంచి లక్క పురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని గ్రామస్తుల ఆవేదన. పురుగుల కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

## సీసీ కుంట పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ జానకి,

**పోలీస్ స్టేషన్ పనితీరుపై సమీక్ష, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని సూచన**

**హైదరాబాద్ పెన్ పవర్:** సీసీ కుంట పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు స్థితి, గ్రేవ్ కేసుల విచారణ, నాన్-గ్రేవ్ కేసుల పరిష్కారం, వారెంట్ల అమలు, పెండింగ్ పిటిషన్లు, కోర్టు ట్రయల్లో ఉన్న కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసును వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తుతో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాల వారీగా అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, ఆర్థిక మోసాల బారిన పడకుండా గ్రామస్థులను అప్రమత్తం చేయాలని సూచించారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి సత్వర సేవలు అందించాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఎస్పీ గారు తెలిపారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని, ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరిగేలా సేవలందించాలని సీసీ కుంట ఎస్ఐకి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కుంట ఎస్ఐ ఓబుల్ రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండ లక్ష్మీ నరసిహస్వామి ఆలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పూజలు



**హైదరాబాద్ పెన్ పవర్:** కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కేంద్ర మంత్రి బండి సంజమయ్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తరువాత వేదపండితులు ఆశీర్వచదించి స్వామివారి ప్రసాదం అందజేశారు. జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు కలుగుతున్న పలు ఇబ్బందుల గురించి వారు వివరించగా వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు గుట్ట మీది దేవాలయం వద్ద లైటింగ్ ఏర్పాటు, ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసే విషయంలో నా వంతు సాయం చేస్తానని వేదపండితులకు, అధికారులకు మంత్రి హామీ ఇచ్చారు.

## ఆషాడం తొలి పూజల్లో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కుమ్మర్ల తొలి బోనం కార్యక్రమంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. కనకాల కట్ట మైసమ్మ అమ్మవారికి పూజలు చేసి తొలి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్ లు మెట్టు సాయి కుమార్, మల్రెడ్డి రాంరెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.



# వెంకన్న సన్నిధి... వికలాంగుల పెన్నిధి

**తిరుమల వెళ్లలేని దివ్యాంగుల కోసం "ట్రస్ట్" సాయం**

**ఖర్చులన్నీ వాళ్లవే**

**ఏడుకొండలవాడి చెంతకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తోన్న "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భారత పుణ్యక్షేత్రాలలో "తిరుమల" ఒకటి. ఏడుకొండలపై విష్ణుమూర్తి అవతారంలో కొలువై ఉన్న ఆ వేంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం ఎంతో మంది భక్తులు తరలి వెళ్తుంటారు. ఆ కోనేటి రాయుడిని కనులారా చూసి, మనసారా వేడుకుంటారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకుంటుంటారు. అయితే, చాలా మంది భక్తులు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా దర్శించుకుంటే మరి కొద్దిమంది మాత్రం జీవితంలో ఒక్కసారి దర్శించుకున్నా చాలని కోరుకుంటారు. ఈ క్రమంలోనే ఒక్కసారి కూడా ఏడుకొండలవాడిని చూసుకోలేని వారికి అండగా నిలుస్తోంది ఓ సంస్థ. అదే "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్". నిరుపేదలు, దివ్యాంగులకు ఆ శ్రీనివాసుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది. తిరుపతి వెంకన్నను దర్శించుకోవాలని చాలా మందికి ఉంటుంది. అయితే, చేతిలో డబ్బులు లేని కారణంగా కొద్దిమంది ఆ కోరికను తుంచుకుంటే దివ్యాంగులు వాళ్ల లోపం కారణంగా వెళ్లలేకుంటారు. అలాంటి వారందరికీ తిరుమలేశుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్".

**సంస్థకు పునాది ఆ ఆలోచనే**

హైదరాబాద్కు చెందిన చుక్కల వేణుకుమార్ అనే వ్యాపారికి ఒకరోజు "ఒక్కసారైనా తిరుమల దర్శనం చేసుకోని వాళు ్లంటారా?" అనే సందేహం వచ్చిందట. ఆ క్రమంలోనే ఓసారి



నాగోల్లో ఉన్న ఒక గుడికి వెళ్లినప్పుడు "తిరుపతికి వెళ్లని వాళ్లున్నారా" అంటూ మైక్లో అడిగించారట. దీంతో "మేం వెళ్లలేదు" అని చాలా మంది చెప్పడం చూసి ఆశ్చర్యపోయారట. దాంతో తన సొంత డబ్బులతోనే కొందరు మురికివాడ ప్రజల్ని ఏడుకొండలు ఎక్కించారు వేణుకుమార్. తిరుమలకి వెళ్లాలని ఉన్నా పేదరికంతో వెళ్లలేనివారి కోసమే స్నేహితులతో కలిసి 2014లో "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"ను ఏర్పాటు చేశారు.

**ఖర్చులన్నీ ట్రస్ట్ తరపునే**

సమాజంలోని పేదలు, దివ్యాంగులకు ఆధ్యాత్మిక సేవలు అందించే ఒక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇది. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కొండను సందర్శించి, శ్రీవారిని దర్శించుకోవాలని ఆశపడే దివ్యాంగులు, అంధులు, అనాథలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు, జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తిరుమల కొండను సందర్శించని భక్తులకు ఈ ట్రస్ట్ పూర్తిగా ఉచితంగా తిరుపతి యాత్రను ఏర్పాటు చేస్తుంది. భక్తులకు తిరుమల వెళ్లడానికి రానూపోనూ ఛార్జీలూ, వసతి, భోజనం అన్నీ వాళ్లే చూసుకుంటారు.

**వాలంటీర్లు కూడా సిద్ధం**

ఈ ట్రస్ట్లో "గరుడ సేన" అనే వాలంటీర్ల బృందం పనిచేస్తుంది. తిరుమల యాత్రకు వచ్చే దివ్యాంగులకు, వృద్ధులకు కొండపై నడవడానికి, వీల్ చైర్ సదుపాయం కల్పించడానికి, సురక్షితమైన దర్శనం చేయించడానికి ఈ వాలంటీర్లు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారు.

**టీటీడీ బోర్డు సాయం**

ఈ ట్రస్టు సేవలకి సాయంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఉచిత వసతి, దర్శన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకూ సుమారు 3000 మంది భక్తులకు వెంకన్న దర్శనభాగ్యం కల్పించిందీ ట్రస్టు.

**ఎలా దరఖాస్తు చేసుకోవాలి**

ఈ ఉచిత సేవలను పొందడానికి ట్రస్ట్ అధికారిక మార్గాల ద్వారా ముందే పేరు నమోదు చేసుకోవాలి. అందుకోసం ట్రస్ట్ అధికారిక వెబ్సైట్ ఖఎఏ.శీతీస్ర లో లేదా వారి వాట్సాప్ నెంబర్ 96661 59999 అందించే గూగుల్ ఫారమ్ను పూరించాలి.

అప్లై చేసుకునే సమయంలో భక్తుని ఆధార్ కార్డ్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికేట్ లేదా నిరుపేదలయితే రేషన్ కార్డ్ జిరాక్సును అందించాలి.

ఈ యాత్రకు సంబంధించిన నమోదు ప్రక్రియ, తదుపరి యాత్ర ఎప్పుడు ఉంటుందో తెలుసుకోవడానికి మీరు నేరుగా ట్రస్ట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఈ ట్రస్ట్ మల్కాజ్గిరిలో ఉంది.

అనేది ప్రధానంగా శారీరక వికలాంగులు, అనాథలు, నిరుపేదలకు ఉచిత తిరుమల దర్శనం కల్పించేందుకు ఏర్పాటయిన ఒక స్వచ్ఛంద సంస్థ.

# కమలానికి ఒక క్రౌడ్ పుల్లర్ అవసరం ఉందటగా?




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో బీజేపీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని భావిస్తుంది. కానీ నాయకత్వం లేమి పార్టీని వెనక్కు లాగుతుంది. బీజేపీ క్రౌడ్ పుల్లర్ లేకపోవడమే అసలు లోపం అని చెప్పుకోవాలి. తెలంగాణలో ఓటు బ్యాంకు పెంచుకుంటున్నా దానిని పోలింగ్ బూత్ స్థాయికి తీసుకెళ్లు నాయకులు లేరు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లలో ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి వంటి నేత ఉన్నారు. బీఆర్ఎస్ లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు ఉన్నారు. కానీ బీజేపీలో అలా ప్రజలను మైకులతో తమ వైపునకు తిప్పుకునే అగ్రనేత ఎవరనేది మాత్రం దుర్భిణి వేసి వెతికినా కనిపించరు. కిషన్ రెడ్డి వంటి వారు ఉన్నా సౌమ్యులు. బండి సంజయ్ మాట జనాలకు పెద్దగా ఎక్కదు. అలాగే లక్ష్మణ్ వంటి నేత జనాన్ని ఆకట్టుకునే నేత కాదు.

**బలపడేందుకు అవకాశమున్నా...**

గతంలో కంటే బీజేపీకి తెలంగాణలో ఓటు బ్యాంకు పెరిగిందనే చెప్పాలి. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు ఒకసారి బీజేపీకి అవకాశమిస్తే తప్పేముందని భావించినా పెద్దగా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. క్రమేపీ బీజేపీ తెలంగాణలో బలపడటానికి కేంద్రంలో ఉన్న మోదీయే కారణమని చెప్పక తప్పదు. మరొకవైపు హిందుత్వ నినాదం కూడా కొంత మేరకు కమలం పార్టీ పెరగడానికి దోహదం చేసిందని చెప్పాలి. రాష్ట్ర విభజన నాటి నుంచి శాసనసభ, పార్లమెంటు స్థానాల సంఖ్య పెంచుకుంటూ వస్తుంది. ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో గెలవడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. కొన్ని కీలకమైన ప్రాంతాల్లో తన పట్టును పెంచుకుంటోంది.

**ఓటు బ్యాంకును ...**

కానీ ఆ ఓటు బ్యాంకును పార్టీకి పదిలం చేసే నాయకత్వం మాత్రం తెలంగాణలో లేకపోవడమే ఇందుకు కారణం. ఆ ధైర్యంతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని హస్తినలోనే చెప్పేశారు. క్రౌడ్ పుల్లర్ లేకపోవడమే ఆ పార్టీకి తీరని లోటు. కొన్ని నియోజకవర్గాల్లోనే బలమైన నేతలున్నారు. అదీ కూడా కనీసం ముప్ఫయి స్థానాల్లోనే కొంత స్థానిక నాయకత్వం బలంగా ఉంది. మిగిలిన చోట్ల పార్టీని చూసి, కేంద్రంలో మోదీని చూసి ఓట్లు వేయాలి. పట్టణ ప్రాంతాల్లో అయితే ఓకే. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం చూసి మాత్రమే ఓటు వేస్తారన్న అంచనా ఉండటంతో బీజేపీ ఇప్పుడు బలమైన నాయకుడు కావాల్సి ఉందని పార్టీ నేతలు, క్యాడరే భావిస్తున్నారు.

# పంచాయితీలకే పరిమితమవుతున్న మీనాక్షి



**వరంగల్, జూలై 16, పెన్ పవర్:** తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీని అంతర్గత విభేదాలు, వరుస వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై దృష్టి సారించడంపక్కన పెట్టి, నేతల మధ్య కుమ్ములాటలను సర్దుబాటు చేయడానికే హైకమాండ్ ప్రతినిధుల సమయం అంతా సరిపోతోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ పరిస్థితికూడా సరిగ్గా ఇలాగే తయారైంది. ఆమె గాంధీ భవన్‌కు వచ్చినప్పటి నుండి నియోజకవర్గాల వారీగా ఉన్న 'పంచాయితీ'లను పరిష్కరించడానికే తన శక్తినంతా ధారపోయాల్సి వస్తోంది. ఇప్పటికేకామారెడ్డి, తుంగతుర్తి, గజ్వేల్ నియోజకవర్గాల్లోని వర్గపోరు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారగా, తాజాగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్, అలాగే కొండా సురేఖ వర్సెస్ కడియంశ్రీహరి వివాదాలు పార్టీలో మరింత అగ్గి రాజేసాయి. ఈ సమస్యలన్నింటినీ సెట్ చేయడానికి మీనాక్షీ నటరాజన్ వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. దీనివల్ల ప్రజల్లోకి వెళ్లిక్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించే అవకాశం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే వ్యూహాలు అమలు చేసే సమయం ఆమెకు దొరకడం లేదనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో

అత్యంత హాట్ టాపిక్‌గా మారింది మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నడుస్తున్న నలిగిపోతున్న వివాదమే. ఈ ఇద్దరు సీనియర్ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలాఉన్న పరిస్థితులపై మీనాక్షీ నటరాజన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గాంధీ భవన్‌లో మంత్రి కొండా సురేఖ, మీనాక్షీ నటరాజన్‌తో సుమారు 15 నిమిషాల పాటు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కడియం శ్రీహరివైఖరిపై, ఆయన వ్యవహరిస్తున్న తీరుపై గతంలో తామిచ్చిన ఫిర్యాదు లేఖను ఈ సందర్భంగా సురేఖ మరోసారి ఇంచార్జ్ ముందుంచారు. మరోవైపు, కడియం శ్రీహరి మాత్రం ఈ వివాదంపై వివరణఇచ్చేందుకు అస్సలు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. తాను ఎలాంటి పొరపాటూ చేయలేదని, కేవలం తన నియోజకవర్గ పనులపై సమీక్ష నిర్వహిస్తే, దాన్నేదో పెద్ద నేరంగా చిత్రీకరిస్తూ కొండా సురేఖరాద్ధాంతం చేస్తున్నారని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. తనలాంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడిని అనవసరంగా వివాదాల్లోకి లాగడం వల్ల వ్యక్తిగతంగా తనకే కాకుండా,పార్టీకి కూడా పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని ఆయన వాదిస్తున్నారు. ఈ వివాదంపై ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఇప్పటికే పూర్తి నివేదికను సిద్ధం చేసి పార్టీ హైకమాండ్‌కు సమర్పించినప్పటికీ,క్షేత్రస్థాయిలో మంటలు చల్లారడం లేదు. ఒకవైపు వరంగల్ రాజకీయం ఇలా ఉంటే, మరోవైపు తుంగతుర్తి నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విభేదాలు కూడా పార్టీని ఇరకాటంలో పడేస్తున్నాయి. ఈతుంగతుర్తి ఎపిసోడ్‌కు సంబంధించి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని పిలిపించి మీనాక్షీ నటరాజన్ సుదీర్ఘంగా మాట్లాడారు. నియోజకవర్గంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగాలే తప్ప, వ్యక్తిగత విభేదాల జోలికి వెళ్లొద్దని ఆమె ఎంపీకి గట్టిగానే సూచించారు. ఇదే సమయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్ పార్టీకి మరో పెద్ద తలనొప్పిగా మారింది. శివచరణ్ వ్యవహార శైలిపై సీనియర్ నేతలు మధుయాష్కీ, ఈశ్వరమ్మ వంటి వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కూడా చాలా సీరియస్‌గా తీసుకున్నారు. అయితే, ఈశ్వరమ్మపై తాను చేసిన వ్యాఖ్యలకు గానూ శివచరణ్ రెడ్డి ఇప్పటికే బహిరంగంగా క్షమాపణలు చెప్పినప్పటికీ, పార్టీ అంతర్గత క్రమశిక్షణపై ఈ ఘటనప్రభావం చూపించింది. అధికారంలో ఉన్న పార్టీగా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లడం, పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడం ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ ప్రధాన బాధ్యతకావాలి. కానీ, దురదృష్టవశాత్తూ నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు, ఈగో క్లాషెస్ కారణంగా ఆమె సమయమంతా గాంధీ భవన్‌లో రాజీ పంచాయితీలు చేయడానికే సరిపోతోంది. కామారెడ్డి, గజ్వేల్, తుంగతుర్తి, వరంగల్.. ఇలా ఏ నియోజకవర్గం చూసినా గ్రూపు రాజకీయాలే కనిపిస్తున్నాయి. మీనాక్షీ నటరాజన్ ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఈ అంతర్గత కుమ్ములాటలు ఎంతవరకుసర్దుమణుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. నేతలు తమ వ్యక్తిగత పంతాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం వైపు దృష్టి సారించకపోతే.. ఇంచార్జ్ ఎన్ని కమిటీలు వేసినా, ఎన్ని గంటలు చర్చలు జరిపినాఫలితం శూన్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అమాత్య..భాగ్యమెప్పుడు...

**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:** సినిమాల్లో లేడీ అమితాబ్‌గా, రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన విజయశాంతి శైలి ఎప్పుడూ విలక్షణమే. ఏ పార్టీలో ఉన్నా తనదైన ముద్ర వేయాలనుకునే ఆమె, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సొంత ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా షాబాద్ మర్డర్ల కేసులో పోలీసుల తీరును, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను ఆమె బహిరంగంగా తప్పుబట్టడం హస్తం పార్టీని తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. అయితే, ఈ విమర్శల వెనుక శాంతిభద్రతల పరిరక్షణ కంటే, ఆమె వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలు స్వపక్షం నుంచే బలంగా వినిపిస్తున్నాయి. విజయశాంతికి ఉన్న మాస్ ఇమేజ్, కరిష్మాను చూసి అన్ని రాజకీయ పార్టీలూ ఆమెను సాదరంగా ఆహ్వానిస్తూ ఉంటాయనేది బహిరంగ రహస్యం. కానీ, ఆమె ట్రాక్ రికార్డును పరిశీలిస్తే క్షేత్రస్థాయి రాజకీయాలకు ఆమె చాలా కాలంగా దూరంగా ఉంటున్నారనే వాస్తవం స్పష్టమవుతుంది. ప్రజల పక్షాన నిలబడి రోడ్లపైకి వచ్చి పోరాడిన దాఖలాలు, లేదా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భాలు ఇటీవలి కాలంలో ఎక్కడా కనిపించలేదు. కేవలం సోషల్ మీడియా వేదికగా అడపాదడపా పోస్టులు పెట్టడానికే ఆమె పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఆ పోస్టులు సైతం పార్టీకి మైలేజ్ తెచ్చేలా కాకుండా, ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేలా ఉండటం గమనార్హం. కేవలం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించకుండాపదవులు ఆశించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు సొంత పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాల వెనుక విజయశాంతి సుదీర్ఘ నిరీక్షణ, అసంతృప్తి దాగి ఉన్నాయని పార్టీ వర్గాలువిశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకు మంత్రి పదవి దక్కాలని ఆమె ఎంతో కాలంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే, సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకునే అధిష్ఠానం ఆమెకు ఆ అవకాశం కల్పించలేకపోయింది. దీంతో ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే విజయశాంతి వ్యూహాత్మకంగా అటు ప్రభుత్వాన్ని,ఇటు పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. సంక్షోభ సమయాల్లో ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చేలా సొంత పార్టీనేతే వ్యవహరించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలాంటి ఒత్తిడి రాజకీయాల ద్వారా అధిష్ఠానాన్ని బెదిరించి తన పంతం నెరవేర్చుకోవాలని ఆమె చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో పలు

పార్టీలు విజయశాంతి కరిష్మాను చూసి ఆమె ఒత్తిళ్లకు లొంగి ఉండవచ్చు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి బెదిరింపు రాజకీయాలు సాగవని

పార్టీ సీనియర్ నాయకులు అంతర్గత చర్చల్లో స్పష్టంచేస్తున్నారు. 24 గంటలూ ప్రజల్లో ఉంటూ, పార్టీ లైన్ దాటకుండా పనిచేసే వారికే పదవులు వస్తాయనే సంకేతాన్ని అధిష్ఠానం ఇప్పటికే బలంగా పంపింది.

తాజా పరిణామాలపై కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆగ్రహంతోఉన్నారని, విజయశాంతికి గట్టిగా లైన్ క్లియర్ చేయాలని నిశ్చయించుకున్నట్టు తెలుస్తోంది. సొంత పార్టీని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, పనిచేస్తేనే పదవులు వస్తాయనే చేదు నిజాన్నిఆమెకు స్పష్టం చేసేందుకు అధిష్ఠానం సిద్ధమవుతోంది. మరి ఈ హెచ్చరికల తర్వాత విజయశాంతి తన రూట్ మారుస్తారా, లేక తన పంథాలోనే ముందుకు సాగుతారా అనేది వేచి చూడాలి.

# సైబర్ బాధితులకు భారీ ఊరట..
# నేరగాళ్లు కొట్టేసిన డబ్బు తిరిగి వెనక్కి..

**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:** సైబర్ మోసాలకు గురై డబ్బు కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శుభవార్త చెప్పింది. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకితీసుకొచ్చింది. అధికారిక మెసేజ్ అందుకున్న వారు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. బ్యాంకులు, చట్ట అమలు సంస్థల ధ్రువీకరణ తర్వాత అర్హులైన వారిఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ కానుంది. సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గుడ్‌న్యూస్ చెప్పింది. బాధితులు తమ డబ్బును సులభంగాతిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా అర్హులైన బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనే రీఫండ్ కోసం దరఖాస్తు

చేసుకుని.. నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలోకి డబ్బు పొందే అవకాశం కల్పించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఐపీఎస్ అధికారి శిఖా గోయెల్ ఈ వివరాలు వెల్లడించారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ (ఎంహెచ్‌ఏ) నుంచి రీఫండ్‌కు సంబంధించిన అధికారిక ఎస్ఎంఎస్ లేదా నోటిఫికేషన్ అందుకున్న బాధితులు మాత్రమే ఈ మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ సేవను వినియోగించుకోవచ్చు. బాధితుల

అభ్యర్థనను చట్ట అమలు సంస్థలు, సంబంధిత బ్యాంకులు ధృవీకరించిన తర్వాత అర్హత ఉన్న వారి ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయనున్నారు. దరఖాస్తు విజయవంతంగా నమోదైనట్లు మెసేజ్ వచ్చినతర్వాత.. ధృవీకరణ పూర్తయ్యాక డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరోసారి అలర్ట్ చేసింది. రీఫండ్ త్వరగా ఇప్పిస్తామని చెప్పే

మోసగాళ్లను నమ్మవద్దని హెచ్చరించింది. ఓటీపీలు, బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలు లేదా ఇతర గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని సూచించింది. రీఫండ్ కోసం ఎలాంటి

ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో సహాయం అవసరమైన బాధితులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెల్ప్‌డెస్క్‌ను లేదా తమ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారిని

నేరుగా సంప్రదించాలని సూచించింది.

## 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్..
## నిందితుల్లో కానిస్టేబుల్

**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:** కొత్తగూడెంలో 14 ఏళ్ల మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగింది. నిందితులలో ఒక పోలీసు కానిస్టేబుల్ వున్నాడు. ప్రేమ పేరుతో ఒకరు భయపెట్టి మరో ఇద్దరు కామాంధులు బాలికపై లైంగిక దాడికి తెగబడ్డారు. ఈ విషయం బయటకు చెబుతామని బెదిరించి మరో ఇద్దరు అత్యాచారం చేసారు. బాధిత బాలిక ఫిర్యాదుతో దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆరుగురిపై పోక్సో కేసు నమోదు చేసారు. ఘటనకు సంబంధించి నలుగురు నిందితుల అరెస్ట్ అయ్యారు. నిందితుల నుంచి మూడు ఆటోలు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న కానిస్టేబుల్ వెంకటేష్, ఆటో డ్రైవర్ గణేష్ కోసం గాలింపు చేపట్టారు.

## నిలుచున్న చోటే ప్రసవం
## కిందపడిన శిశువుకు గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళను అక్కడి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో గర్భిణి నిల్చున్న చోటే బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బిడ్డ పుట్టాక కూడా 10 నిమిషాల వరకు వైద్యులు రాలేదని కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటన చూసి ఇతర రోగులు భయాందోళనకు గురైయారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## ఎస్ ఐ ఆర్ గడువు పొడగింపును వినియోగించుకోవాలి:

**ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు.**

**ఆగస్టు 3 చివరి తేదీ... అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా**

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువును మరో పదిరోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును అప్ డేట్ చేసుకోవాలని కేఎల్ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి దీూాలకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు. డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ దీూా లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి... దీూాలకు సహకరించాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్న సూచించారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు

**హెచ్ఎంఎస్ - తెలంగాణ రక్షణ సేన గాంధేయమార్గంలో పోరాడి సాధించిన సంయుక్త విజయం**

**హైదరాబాద్ పెన్ పవర్:** మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేసిన అప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరంకుశ సింగరేణి యాజమాన్యం మా ఉద్యమానికి దిగివచ్చిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు ఈనెల 17, 18 న మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నది.. ఇది వేలాది మంది సింగరేణి కార్మికుల గెలుపు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు. వేలాది మంది కార్మికులు అనారోగ్య సమస్యలతో మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా వారి మనోవేదనకు కారణమవుతోంది. మేము ఉద్యమించామని ఇప్పుడు మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడం కాదు.. ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి. సింగరేణి కార్మికులు ఎవరిని సూచిస్తే వారికి వారసత్వ ఉద్యోగం ఇవ్వాలి.. మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని ఆమె అన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీల పై హైకోర్టు విచారణ
## కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం బ్యారేజీల అంశంపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్యే కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయిన విషయం తెలిసిందే.కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పిటిషనర్ ఆరోపణ. రైతుల ప్రయోజనాల కోసం ఎన్డీ ఎస్ ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించాలని వాదన. మిగిలిన రిజర్వాయర్లపై కూడా ఎన్డీఎస్ ఏ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, సుందిళ్ల పంప్హౌస్ల భద్రతపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్డీఎస్ ఏ తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

## ఆ వార్తలు నిరాధారం
## మా అబ్బాయి డ్రగ్స్ తీసుకోలేదు .. అరెస్ట్ కాలేదు

**ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి**

**హైదరాబాద్ పెన్ పవర్:** మా అబ్బాయి భరత్ రాజ్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్టు.. మంగళ్ హాట్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదు. మీడియాలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారం.. అవాస్తవమని ఎమ్మెల్సీ వెంకట్రాం రెడ్డి వివరణ ఇచ్చారు.

గురువారం ఉదయం మంగళ్ హాట్ పోలీసులు మా ఇంటికి వచ్చి ఒక డ్రగ్స్ కు సంబంధించి కేసు విచారణ జరుపుతున్నామని.. భరత్ రాజ్ రెడ్డి కామన్ ఫ్రెండ్స్ ఫోన్ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉండడంతో అనుమానంతో విచారించాల్సి ఉందని కోరారు. విచారణలో ఈ డ్రగ్స్ కేసు వ్యవహారానికి భరత్ రాజ్ కు ఏ సంబంధం లేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. భరత్ రాజ్ కు చేసిన డ్రగ్స్ టెస్ట్ లో నెగెటీవ్ వచ్చింది. ఈ విషయంలో అనేక అవాస్తవాలు, కల్పిత సమాచారం ప్రచారంలో ఉన్నాయి. నాకుమారుడు ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదు... ఈ కేసులో అరెస్ట్ కాలేదని అన్నారు.

## వసతులు లేవని గురుకుల బాలికల అందోళన

**మహబూబాబాద్ పెన్ పవర్:** కొత్తగూడ మండలంలోని గాంధీనగర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల బాలికలు రోడెక్కారు. మాకు దోమలు, పురుగులు కుట్టి శరీరం మొత్తం అలర్జీ లాగా అవుతుంది. రూల్ నంబర్లు వేసి మాతో బాత్రూంలు క్లీన్ చేయిస్తున్నారు. ఇదేంటని అడిగితే వేధిస్తున్నారని ఆరోపించారు. మేం పిల్లలం. తలా 20 రూపాయలు ఇస్తే బాత్రూంలు క్లీన్ చేయిస్తాం, లేదంటే మీరే చేసుకోండి అని ప్రిన్సిపాల్ మేడం అంటుంది. సంవత్సరం నుండి సరిగ్గా నీళ్లు రావట్లేదు. అడిగితే మార్కులు కట్ చేసి ఫెయిల్ చేస్తామని భయపెడుతున్నారని అన్నారు.

## హరీష్ వ్యూహాత్మక మౌనమేనా




**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఏ క్షణంలోనైనా తనే ముందుండి ప్రత్యర్థులపై వ్యతిరేక దాడి చేయడమే తప్ప, ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలో రాజకీయాలు చేసే అలవాటు లేని బలమైన నాయకుడు తన్నీరు హరీష్ రావు దీనికి ప్రధాన కారణం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయనపై పెద్దగా అవినీతి మరకలు లేకపోవడమే. గతంలో ఆయనపై వచ్చిన విమర్శలన్నీ కేవలం రాజకీయ కోణంలో చేసినవే తప్ప, పక్కా ఆధారాలతో ఆయన్ను ఇరకాటంలో పెట్టే స్థాయి ఆరోపణలు ఇప్పటి వరకు రాలేదు. కానీ, ప్రస్తుతం హరీష్ రావు తన రాజకీయ జీవితంలోనే మొదటిసారిగా సమాధానం చెప్పుకోవాల్సిన సంకట స్థితిలో పడ్డారు. ఈ వివాదానికి కేంద్ర బిందువు హరీష్ రావు సతీమణి యాజమాన్యంలోని మిల్చీ మిల్క్ డైరీ బ్రాండ్. ఈ కంపెనీ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు పంపిణీ చేసే వాటా చాలా పరిమితంగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రముఖ విద్యాసంస్థలు , కాలేజీలకే అత్యధికంగా పాలను సరఫరా చేస్తుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి, సదరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలను, ఆసుపత్రులను బెదిరించి బలవంతంగా ఈ బ్రాండ్ పాలను కొనుగోలు చేయించారనే తీవ్రమైన ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కల్వకుంట్ల కవితతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా నేరుగా ఇవే ఆరోపణలు గుప్పించడంతో ఈ అంశానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. హరీష్ రావు కుటుంబ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఆరోపణలు ఇలా సాగుతుండగానే, ఊహించని విధంగా మిల్చీ మిల్క్ అధికారిక వెబ్‌సైట్ హఠాత్తుగా ఇంటర్నెట్ నుండి డౌన్ కావడం ఈ వివాదాన్ని మరింత పెంచింది. వెబ్‌సైట్ డౌన్ చేయడానికి అఫీషియల్ క్లైంట్స్ పేజీలో ఉన్న బడా విద్యాసంస్థల లోగోలు, పేర్లను కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేయడమేనని తెలుస్తోంది. ఈ స్క్రీన్ షాట్లు నెట్టింట వైరల్ కావడంతో, హరీష్ రావు క్యాంప్‌లో కొంత కంగారు మొదలైందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. నిజంగానే అక్రమాలు జరగకపోతే వెబ్‌సైట్‌ను ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలను ప్రత్యర్థులు బలంగా సంధిస్తున్నారు. అయితే, తన రాజకీయ జీవితంలో ఎంతటి పెద్ద సంక్షోభాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొన్న హరీష్ రావు.. ఇంతవరకు ఈ మిల్చీ మిల్క్ వివాదంపై నేరుగా ఎక్కడా స్పందించలేదు. సాధారణంగా తనపై చిన్న విమర్శ వచ్చినా గణాంకాలతో సహా తిప్పికొట్టే హరీష్, ఈ ఫ్యామిలీ బిజినెస్ వివాదంలో వ్యూహాత్మక మౌనం వహించడం వెనుక ఉన్న కారణాలపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన ఈ అంశంపై గట్టిగా, పక్కా ఆధారాలతో స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో హరీష్ రావు కనుక ఈ ఆరోపణలను బలంగా తిప్పికొట్టి తన వాదనను ప్రజల ముందు ఉంచగలిగితే ఈ వివాదానికి బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఈ మౌనాన్ని ఇలాగే కొనసాగిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఒక బలమైన పొలిటికల్ అస్త్రంగా మలచుకుని, ఎల్లప్పుడూ క్లీన్ ఇమేజ్‌తో ఉండే హరీష్ రావును రాజకీయంగా కార్నర్ చేస్తూనే ఉండే ప్రమాదం ఉంది. ఏదేమైనా, ఎప్పుడూ డిఫెన్స్‌లో పడనని చెప్పుకునే హరీష్ రావుకు ఈ డైరీ వివాదం ఒక పెద్ద పరీక్షగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని భావిస్తున్నారు.

## హైడ్రా వేటలో రియల్ ఎస్టేట్ రాముడు టార్గెట్
## తెలంగాణ రాజకీయాల్లో తెర వెనుక ఏం జరుగుతోంది?

**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:** హైదరాబాద్ మహానగరంలో చెరువుల సంరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా చర్యలు రోజురోజుకూ సరికొత్త పొలిటికల్ టర్న్ తీసుకుంటున్నాయి. కేవలం సాధారణనిబంధనల ఉల్లంఘనల ఆధారంగానే కాకుండా, ఒక పక్కా వ్యూహం ప్రకారం బడా ప్రాజెక్టులపై హైడ్రా విరుచుకుపడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ప్రదీప్ బిల్డర్స్, సంధ్యా కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్ రావుకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రతిష్టాత్మక నిర్మాణాలను హైడ్రా టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయనే చర్చ రియల్ ఎస్టేట్ వర్గాల్లో జోరందుకుంది.ఈ మొత్తం వ్యవహారంలో తెరపైకి వస్తున్న అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైడ్రా విరుచుకుపడుతున్న ఈ బడా ప్రాజెక్టులన్నింటికీ ఒక అంతర్గత లింక్ ఉందనే ప్రచారం సాగడం. ఈ లింక్ నేరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వైపు కనెక్ట్ అవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇటీవల సోషల్ మీడియా వేదికగా విసిరిన కొన్ని పరోక్ష విమర్శలు, రియల్ ఎస్టేట్ రాముడు అంటూ పెట్టిన నిక్ నేమ్ ఈ చర్చలకు మరింత ఆజ్యం పోశాయి. గత ప్రభుత్వ హయాంలో ఐటీ, మున్సిపల్ శాఖల నీడన సాగిన కొన్నిబడా రియల్ ఎస్టేట్ లావాదేవీల చిట్టా ఇప్పుడు బయటకు వస్తోందనే సంకేతాలు దీని ద్వారా వ్యక్తమవుతున్నాయి.నిజానికి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని స్థాయికి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే తెరవెనుక అనేక భారీ ఆర్థిక లావాదేవీలు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధుల మార్పులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ ఇన్ అండ్ అవుట్ లావాదేవీలపై, ఎవరెవరికి వాటాలు వెళ్లాయనే దానిపై పక్కా సమాచారం ఉంటుంది. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత, వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల ఆయా సంస్థల అంతర్గత సమాచారం, పాత లీకులు కొత్త ప్రభుత్వ పెద్దల చేతికి చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లీకుల ఆధారంగానే, గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ నిబంధనలను బేఖాతరు చేసిన సదరు బడా బిల్డర్ల ప్రాజెక్టులనే హైడ్రా ఇప్పుడు ప్రత్యేకంగా టార్గెట్ చేస్తోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు.. గత పాలకుల ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఒక వ్యూహాత్మక పొలిటికల్ అటాక్ అని భావిస్తున్నారు. ఎక్కడైతే గత ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలు లేదా బినామీ హస్తాలు ఉన్నాయని అనుమానాలు ఉన్నాయో, సరిగ్గా ఆయా కట్టడాల వద్దకే హైడ్రా బుల్డోజర్లు వెళ్తుండటం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది.ఇప్పుడు అందరినీ వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న.. ఈ హైడ్రా వేట ఇంతటితో ఆగిపోతుందా? లేక తెరవెనుక ఏవైనా బ్యాక్ గ్రౌండ్ సెటిల్మెంట్లు జరుగుతాయా? అనేది. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి భారీ దాడులు జరిగినప్పుడు, సదరు వ్యాపారులు నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ పెద్దలతో సయోధ్య కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తుంటారనేది ఓ బహిరంగ రహస్యం. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో హైడ్రా నిజంగానే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుని, ఈ బడా ప్రాజెక్టుల వెనుక ఉన్న అసలైన సూత్రధారులను చట్టం ముందు నిలబెడుతుందా.. లేదా కేవలం రాజకీయ మైలేజ్ కోసమే ఈ రచ్చ సాగుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి. హైడ్రా తీసుకుంటున్న ఈ దూకుడు నిర్ణయాలు అటు బీఆర్ఎస్ అగ్ర నాయకత్వానికి, ఇటు భాగ్యనగర రియల్ ఎస్టేట్ మాఫియాకు ఒక బలమైన హెచ్చరిక లాంటివని రాజకీయవర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి.

## మృత్యువాత నుండి బయటపడిన మత్స్యకారులు
### ఇద్దరికి తీవ్ర గాయాలు
### కేజిహెచ్ లు చికిత్స

**హైదరాబాద్ పెన్ పవర్:** బోటుపై ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఫిషింగ్ హార్బర్ కు దగ్గరలో సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా సాగర జలాలు ఒక్కసారిగా వలను లాక్కున్నాయి. ఈ ఘటనలో పడవ బోల్తాపడి మత్స్యకారులపై పడింది. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆ బోర్డుతో పాటు మత్స్యకారులు పెద్ద రాళ్లకు మధ్యలో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో మత్స్యకారులు బోటును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. తాతారావు, ఆకాష్ అనే ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన గంగపుత్రులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో రెండున్నర లక్షల పైగా విలువ చేసే బోటు, రెండు లక్షల రూపాయలు విలువ చేసే వల పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. గంగమ్మ తల్లి అనుగ్రహంతో ప్రాణాలతో బయటపడ్డామని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.




# డ్రాగన్ పైనే జూనియర్ ఆశలు

**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:**
జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన డ్రాగన్ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాతో ఎలాగైనా సరే సూపర్ సక్సెస్ ని సాధించి తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకోవాలని జూనియర్ ఎన్టీఆర్ ప్లాన్ చేసుకుంటున్నాడు. ఇక ఇప్పటివరకు తన కెరియర్ లో ఇండస్ట్రీ హిట్ అయితే నమోదు కాలేదు. ఈ సినిమాతో ఎలాగైనా సరే ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకొని యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని తన వైపు తిప్పుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు... ఇక ఈ సినిమా క్లైమాక్స్ చాలా డిఫరెంట్ గా ప్లాన్ చేశారట. ఇప్పటివరకు ఏ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో లేనటువంటి క్లైమాక్స్ ని మనం ఈ సినిమాలో చూడబోతున్నాం అంటూ ప్రశాంత్ నీల్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. తను అన్నట్టుగానే ఈ సినిమా క్లైమాక్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటుందా? ఎన్టీఆర్ ఈ సినిమాలో ఎలాంటి విన్యాసాలు చేయబోతున్నాడు.ఎన్టీఆర్ ఇమేజ్ కి తగ్గట్టుగానే ఈ క్లైమాక్స్ ఉంటుందా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది... తను అనుకున్నట్టుగానే ఈ సినిమాతో తను ఎలాంటి సక్సెస్ ని సాధిస్తాడు. ప్రేక్షకులందరిలో ఒక ఐడెంటిటి క్రియేట్ చేసుకోగలిగే కెపాసిటి అతనికి ఉందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...ఇక ఎన్టీఆర్ ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గాడ్ ఆఫ్ వార్' సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమాతో పౌరాణికానికి సంబంధించిన పాత్రను కూడా తను చేయగలనని మరోసారి ప్రూవ్ చేయడానికి ఈ సినిమాలో అతనికి ఒక మంచి అవకాశం దొరకబోతుందట.తద్వారా తను ఆయా పాత్రల్లో ఒదిగి పోయి నటించి ప్రేక్షకులను మెప్పిస్తాననే ఒక దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది... మొత్తానికైతే ఎన్టీఆర్ రాబోయే రోజుల్లో వరుసగా సక్సెస్ లను సాధించి ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో నెంబర్ వన్ హీరోగా ఎదగాలనే ప్రయత్నం చేస్తున్నాడు. అది ఎంత వరకు వర్కౌట్ అవుతుందనేది తెలియాలంటే మాత్రం మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...

# టాటా గ్రూప్ బ్రాండ్ విలువ రూ. 3.24 లక్షల కోట్లు

**ముంబై జూలై 16, పెన్ పవర్:**
భారతీయ కార్పొరేట్ రంగంలో 'టాటా' గ్రూప్ మరోసారి తన తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రముఖ బ్రాండ్ వాల్యుయేషన్ కన్సల్టెన్సీ సంస్థ 'బ్రాండ్ ఫైనాన్స్' తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలోనే అత్యంత విలువైన టాప్ 100 బ్రాండ్ల జాబితాలో టాటా గ్రూప్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. విశేషం ఏమిటంటే ఈ జాబితాలో టాటా అగ్రస్థానంలో నిలవడం ఇది వరుసగా 10వ సారి. టాటా తరువాత ఇంకా ఏమేం సంస్థలు ఉన్నాయో చూద్దాం..ప్రస్తుతం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ రూ. 3.24 లక్షల కోట్లకు (సుమారు 39 బిలియన్ డాలర్లు) చేరినట్లు 'బ్రాండ్ ఫైనాన్స్' నివేదిక వెల్లడించింది. వైవిధ్యభరితమైన వ్యాపారాలు, నమ్మకమైన సేవలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విస్తృతి టాటా బ్రాండ్ విలువను ఇంతలా పెంచడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

**టాప్ 5 లో నిలిచిన ఇతర దిగ్గజాలు**

ఈ జాబితాలో టాటా తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది.
ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ రూ. 1.58 లక్షల కోట్లుగా నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో దేశీయ బ్యాంకింగ్, భీమా రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు నిలిచాయి.
రెండో స్థానం: ఇన్ఫోసిస్ (రూ. 1.58 లక్షల కోట్లు)
మూడో స్థానం: ఎల్ఐసీ – LIC (రూ. 1.47 లక్షల కోట్లు)
నాలుగో స్థానం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
ఐదో స్థానం: రిలయన్స్ ఇండస్ట్రీస్

**భారత ఆర్థిక వ్యవస్థ జోరుకు నిదర్శనం**

ఈ నివేదిక ప్రకారం, భారతదేశంలోని టాప్ 100 బ్రాండ్ల మొత్తం సంయుక్త విలువ రూ. 24.34 లక్షల కోట్లకు చేరింది. ఇది భారతీయ కంపెనీల బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో ఎంతలా బలపడుతుందో తెలియజేస్తోంది. బ్యాంకింగ్, ఐటీ, టెలికాం, ప్యాకేజ్డ్ గూడ్స్ వంటి రంగాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. కొన్ని ఏళ్లుగా ఎదురవుతున్న ప్రపంచ ఆర్థిక సవాళ్లను తట్టుకుని మరీ భారతీయ బ్రాండ్లు ఇంతటి వృద్ధిని నమోదు చేయడం విశేషం. ముఖ్యంగా డిజిటలైజేషన్, కస్టమర్ నమ్మకాన్ని గెలుచుకోవడం వల్లే ఈ బ్రాండ్ల విలువ భారీగా పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

# కేంద్రంతో సయోధ్యకి రేవంత్



**హైదరాబాద్, జూలై 16, పెన్ పవర్:**
రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత సామెత. కానీ, కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉంటే.. నిత్యం కత్తులు దూసుకోవడం, సవాళ్లు విసురుకోవడంభారత రాజకీయంలో మనం తరచూ చూసే నిత్యకృత్యం. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ లేదా ఇతర ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాల మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణమే కనిపించేది. గతంలో తెలంగాణలోనూ ఇదే తరహా 'ఢీ అంటే ఢీ' అనే రాజకీయాలు నడిచాయి. అయితే, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పాత పంథాకు పూర్తిగా స్వస్తి పలికింది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవచ్చనే సరికొత్త రాజకీయ ఒరవడికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు.ఎన్నికల రణక్షేత్రంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే రాజకీయ వైరాన్ని కొనసాగిస్తే నష్టపోయేది రాష్ట్ర అభివృద్ధి, ప్రజలేనని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిత్యం తలపడే ధోరణిని పక్కనబెట్టి, సామరస్య పూర్వక వైఖరిని అవలంబిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి వరుసగా కలుస్తున్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన చట్టం హామీలను వారికి వివరంగా వివరిస్తున్నారు. కేంద్రం నుంచి ఆమోద ముద్ర పొందేలా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలను సైతం కలుపుకుంటూ, వారి ద్వారా కూడా ఒత్తిడి తెచ్చే వ్యూహాత్మక పంథాను అనుసరిస్తున్నారు.ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో 'పెద్దన్న' అని సంబోధించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయ్యి ఉండి మోడీని అలా కొనియాడడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే ప్రచారంజరిగింది. అయితే దీనిపై రేవంత్ రెడ్డి అత్యంత స్పష్టతతో సమాధానమిచ్చారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ప్రధానే పెద్ద దిక్కు కాబట్టి, ఆ కోణంలోనే తాను 'పెద్దన్న' అన్నానని, అంతేకానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తానేనాడూ రాజీ పడబోనని కుండబద్దలు కొట్టారు. అవసరమైనప్పుడు హక్కుల కోసం కొట్లాడతామని, మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.మరోవైపు రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రధాని మోడీ కూడా సానుకూల వైఖరితోనే ఉన్నట్లు కనిపిస్తోంది. "తనతో కలిసి పనిచేసి చూడు.. రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్తాం" అంటూ మోడీ బహిరంగంగానే రేవంత్‌కు పిలుపునివ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మోడీ ఇలా రేవంత్‌కు గాలం వేస్తున్నారనే ప్రచారాలు సాగినా, వాటన్నింటినీ రేవంత్ రెడ్డి తనదైన శైలిలో తిప్పికొట్టారు. తన దృష్టంతా కేవలం తెలంగాణ అభివృద్ధి పైనేనని తేల్చిచెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఘర్షణ వాతావరణాన్ని పక్కన పెట్టడం, దానికి తగ్గట్టే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు అవసరమైన సహాయసహకారాలు అందించడం ఒక సానుకూల పరిణామం. కేంద్ర–రాష్ట్రాల మధ్య ఉండాల్సిన ఫెడరల్ స్ఫూర్తికి ఇది ఒక కొత్త నిర్వచనంగా నిలుస్తోంది.ఎన్నికల సమయంలో ఎంతటి రాజకీయ శత్రుత్వమైనా ఉండొచ్చు, కానీ పాలనలోకి వచ్చేసరికి ప్రజల బాగు కోసం కలిసి నడవాలనే రేవంత్ రెడ్డి సూత్రం తెలంగాణ ప్రయోజనాలకు ఎంతవరకు లాభిస్తుందో చూడాలి. ఏదేమైనా, కేంద్రంతో నిత్యం యుద్ధం చేసే పాత పంథాకు భిన్నంగా రేవంత్ రెడ్డి తెచ్చిన ఈ సరికొత్త రాజకీయ ఒరవడి ప్రస్తుతానికి తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఆసక్తికరమైన, లోతైన చర్చకు దారితీస్తోంది.

# ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం. ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది. వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

**చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు. దీనివల్ల క్యాడర్‌లో ఒక విధమైన ఒంటరితనం, ఆవేదన గూడుకట్టుకుంటున్నాయి. ఈ పొలిటికల్ గ్యాప్‌ను భర్తీ చేయడానికి టీడీపీ హైకమాండ్ తక్షణమే ఒక ప్రత్యేకమైన, అత్యంత నమ్మకమైన అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీలోని సీనియర్ నేతలు లేదా పొలిట్‌బ్యూరో సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఎమ్మెల్యేలతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించాలి. తమ సమస్యలను క్లియర్ కట్‌గా చెప్పుకునే వేదిక ఉందని, తమ ఆందోళనలపై అధిష్ఠానం కచ్చితంగా యాక్షన్ తీసుకుంటుందనే గట్టి నమ్మకం ఎమ్మెల్యేలలో కలగాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో అసంతృప్తి చల్లారి, ప్రభుత్వం-పార్టీల మధ్య సమన్వయం కుదురుతుంది. పాలనలో మంచితనం, పారదర్శకత ఎంత ముఖ్యమో.. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న రాజకీయ సైనికులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను కట్టడి చేయకపోతే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తు రాజకీయాల్లో గానీ కూటమి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చంద్రబాబు-లోకేష్ ద్వయం ఇప్పటికైనా కిందిస్థాయి నేతల అంతర్గత ఆవేదనను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఒక పటిష్టమైన వేదికను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో, ఈ చిన్న చిన్న అసంతృప్తులే రాబోయే రోజుల్లో పెద్ద అంతర్గత కుమ్ములాటలకు దారితీసే ప్రమాదం ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం.

## జగన్ ఫ్రస్టేషన్ అంతకు మించి



**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు. మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు. ఆధారాలతో సహా దొరికిపోయిన తర్వాతే నిందితుడు లొంగిపోగా, అసలు ఆ 18 ఏళ్ల పిల్లోడిపై కేసు పెట్టడమే తప్పు అన్నట్లుగా జగన్ మాట్లాడటం వెనుక కేవలం రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాలే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ కేసులో నిందితుడిని వెనకేసుకురావడం ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక సూత్రాన్ని జగన్ రెడ్డి విస్మరించినట్లు స్పష్టమవుతోంది. నిందితుడు తమ పార్టీ నేత కుమారుడైనంత మాత్రాన, ఈ ప్రమాదంలో చనిపోయిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన గొర్రెల కాపరి ప్రాణానికి విలువే లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తికి చట్టాలపై కనీస అవగాహన లేకపోవడం, లేదా తెలిసి కూడా తప్పుడు కేసులను సమర్థించడం చూస్తుంటే ఆయన పూర్తి మైండ్ బ్యాలెన్స్ కోల్పోయారనడానికి ఈ విశాఖ పర్యటనే నిదర్శనంగా కనిపిస్తోంది.

# అయోమయంలో అమరావతి రైతులు



**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అత్యంత కీలకమైన ఉండవల్లి గ్రామంలోని సుమారు 2 ఎకరాల 77 సెంట్ల భూమిని ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కొందరు రైతులు, వారి వెనుక ఉన్న శక్తులు భీష్మించుకు కూర్చున్నప్పటికీ.. గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ముగియడంతో రెవెన్యూ, సీఆర్‌డీఏ యంత్రాంగం రంగంలోకి దిగి భూమిని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. దీంతో రాజధానిలో రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. భూసేకరణ నిబంధనల ప్రకారం 10 మంది రైతులకు చెందిన ఈ 2.77 ఎకరాల భూమికి గాను ప్రభుత్వం మొత్తం రూ.7 కోట్ల 14 లక్షల భారీ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2 కోట్ల 58 లక్షల మేర నష్టపరిహారం లభిస్తుంది. శుక్రవారం రాత్రి సీఆర్‌డీఏ అధికారులు ఈ పరిహారానికి సంబంధించిన చెక్కులను నేరుగా రైతుల వద్దకు తీసుకువెళ్లినప్పటికీ, వారు వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. అభివృద్ధికి సహకరించకుండా ఉద్దేశపూర్వకంగానే వారు చెక్కులను తిరస్కరించడంతో.. అధికారులు సదరు పరిహారం మొత్తాన్ని చట్టప్రకారం ఎల్.ఎల్.ఆర్.ఆర్ అథారిటీలో డిపాజిట్ చేశారు. అనంతరం రంగంలోకి దిగిన ఏడీసీఎల్ , ఎన్‌సీసీ కంపెనీల సిబ్బంది పనులను ముమ్మరం చేసి, 24 గంటల్లో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధప్రతిపాదికన మట్టి పనులు జరుపుతున్నారు. అమరావతి ల్యాండ్ పూలింగ్‌కు మొదటి నుండి సహకరించకుండా కోర్టు స్టేలతో కాలయాపన చేసిన ఈ భూముల వెనుక పెద్ద ఎత్తున వైసీపీ నేతల రాజకీయ హస్తం ఉందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రైతుల మాదిరిగానే వీరు కూడా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి ఉంటే, వాటికి బదులుగా వచ్చే కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లను అమ్ముకున్నా ఎకరాకు సుమారు రూ.6 నుంచి 7 కోట్లకు పైగా వచ్చేది. కానీ, పూలింగ్ ఇవ్వకుండా కేవలం రూ.2.58 కోట్ల ప్రభుత్వ పరిహారానికి పరిమితం కావడం వెనుక వైసీపీ నేతల ఇన్‌సైడర్ ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటే ఇచ్చే ప్యాకేజీలు, రాజకీయ లబ్ధి ఎక్కువగా ఉంటుందనే ఆశతోనే సదరు నేతలు ఈ భూములను ముందే కొనుగోలు చేసి, రైతుల పేరుతో తెరవెనుక డ్రామాలు ఆడించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఆటంకంగా మారిన ఈ ల్యాండ్ పూలింగ్ వివాదంలో నోటీసులు ఇచ్చే వరకు మొత్తం 18 మంది రైతులు సుమారు 4 ఎకరాల మేర ఇవ్వకుండా మొండికేసారు. అయితే మారుతున్న పరిస్థితులు, లీగల్ చిక్కులను గమనించిన 8 మంది రైతులు ఇటీవలే తమ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. మిగిలిన 2.77 ఎకరాలకు సంబంధించి ఒక స్థానిక న్యాయవాది స్వయంగా భూమి ఇవ్వనని పట్టుబట్టడంతో, ఆయన మాటలు నమ్మి మిగతా 9 మంది రైతులు కూడా ఇన్నాళ్లూ భూములను ఆపారు. దీంతో శనివారం ఉదయం అధికారులు మొదట సదరు లాయర్‌కు చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే ఈ ఆపరేషన్ ప్రారంభించారు.

# కేరళ రేంజ్ లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

**విశాఖపట్టణం, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

## నల్లమల్లో వజ్రాల వేట

**కర్నూలు, జూలై 16, పెన్ పవర్:** నంద్యాల - ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు. నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది. నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలోని వజ్రకరూర్, కర్నూలు జిల్లాలోని తుగ్గిలి, జొన్నగిరి వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది తీర ప్రాంతాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. తొలకరి వర్షాలకు మట్టి కొట్టుకుపోయి వజ్రాలు బయటపడతాయని ప్రజలు భావిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో దొరికే వజ్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగు, రాళ్లవాగులో వర్షాకాలం వజ్రాల అన్వేషణ జోరుగా సాగుతుంది. గాజులపల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్వం స్వామి, అమ్మవార్ల కల్యాణానికి వజ్రాలను తలంబ్రాలుగా ఉపయోగించే వారని, అందుకే ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికే అవకాశం ఉందని ప్రజలు భావిస్తారు. కేవలం స్థానికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

# 26 లక్షల ఓట్లపై గల్లంతు

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఇంకా కొంత పని మిగిలి ఉండటంతో గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం ను కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం మరో పది రోజుల అదనపు గడువును మంజూరు చేసింది. దీంతో మిగిలిన పనిని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మరింత చురుకుగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా గడువు పొడిగించాలన్న అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 88 శాతం సవరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు 12 శాతం పని మిగిలి ఉండగా, కొత్త గడువులో దానిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, వాటిని సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 14 నాటికి 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మరో 1.67 శాతం ఫారాల నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియలో కీలకమైన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో ఇప్పటికే మరణించిన 14 లక్షల 19 వేల 644 మంది పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధృవీకరణ పూర్తయిన తర్వాత ఈ పేర్లు జాబితా నుంచి తొలగించబడతాయి. అదే విధంగా ఉద్యోగాలు, వ్యాపారం లేదా ఇతర కారణాలతో శాశ్వతంగా ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిన వారి వివరాలను కూడా పరిశీలించారు. ఇప్పటికే 12 లక్షల 14 వేల 994 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించిన అధికారులు, వారి ఓటు నమోదుపై కూడా తగిన చర్యలు చేపడుతున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారి సంఖ్య కలిపితే దాదాపు 26 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఇంకా మరికొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గడంతో పాటు, చెల్లని ఓట్లను తొలగించి మరింత పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమనే ఆశాభావాన్ని ఎన్నికల అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న ఎన్నికల నిర్వహణ మరింత విశ్వసనీయంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## సంపాదకీయం

# జలసంధి జగడం!

ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాల్లో యుద్ధాలు, విప్లవాల సరసన సముద్ర జలసంధులదీ ప్రత్యేక అధ్యాయమే! ఖండాలను విడదీస్తూ, మహాసముద్రాలను కలుపుతూ ఇరుకుగా సాగే 'చోక్ పాయింట్లు' ప్రపంచ వాణిజ్యానికి ప్రాణనాడులు. వాటి గొంతు నొక్కితే ఖండాంతర ఆర్థిక వ్యవస్థలే ఉక్కిరిబిక్కిరవుతాయి. 1956నాటి సూయిజ్ సంక్షోభం సృష్టించిన భౌగోళిక రాజకీయ సునామీ తర్వాత.. ఏడు దశాబ్దాలకు మళ్లీ అలాంటి పరిణామాలే పునరావృతమవుతున్నాయి. అమెరికా–ఇరాన్ పరస్పర దిగ్బంధనాలతో హర్మూజ్ జలసంధి మూసుకుపోవడం, కాల్పుల విరమణ పేకమేడలా పెళుసుగా మారడం, రాకపోకల హక్కులపై ప్రతిష్టంభన కొనసాగడం.. అంతర్జాతీయ సముద్ర వాణిజ్యం ఎంత బలహీన పునాదులపై నిలబడి ఉందో బట్టబయలు చేశాయి. ఒకప్పుడు స్వేచ్ఛా రాకపోకలకు నెలవైన హర్మూజ్‌ను ఇరాన్ ఒత్తిడి అస్త్రంగా మార్చుకుని సుంకాలు విధించే స్థాయికి చేరడం ప్రపంచ దేశాలకు కొత్త పాఠం! ఈ నేపథ్యంలో ప్రపంచం దృష్టి మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైంది. హర్మూజ్ మూతపడక ముందు అక్కడి నుంచి రోజుకు 134 నౌకలు రాకపోకలు సాగిస్తే.. జూలై 14న ఒక్కరోజే మలక్కా మీదుగా 281 నౌకలు ప్రయాణించాయని షిప్ ట్రాకర్ గణాంకాలు చెబుతున్నాయి. మలేసియా, సింగపూర్, ఇండోనేసియాల మధ్య 900 కి.మీ. పొడవు, 65 కి.మీ. వెడల్పుతో విస్తరించిన ఈ జలసంధి.. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో 24 శాతాన్ని, చమురు రవాణాలో ఏకంగా 45 శాతాన్ని, కార్గో షిప్‌మెంట్లలో 23 శాతాన్ని మోస్తోంది. మలేసియా, ఇండోనేసియా, థాయిలాండ్, సింగపూర్ ఈ జలసంధికి 'సంరక్షక' పాత్ర పోషిస్తుండగా.. చైనా, అమెరికా, భారత్, జపాన్‌లతోపాటు యావత్ ఆసియాన్‌కు మలక్కా నిరాటంకంగా ఉండటం జీవన్మరణ సమస్య. కానీ గల్ఫ్ యుద్ధ పర్యవసానాలతో దక్షిణ చైనా సముద్రం, తైవాన్ జలసంధుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దక్షిణ చైనా సముద్రం మొత్తంపై చైనా దావా 2016నాటి 'అంక్లోస్' తీర్పుకు విరుద్ధమని పశ్చిమ దేశాలు మరోసారి తేల్చినా బీజింగ్ ఖాతరు చేయడం లేదు. 2003 నుంచి ఆసియాన్ కోరుతున్న ప్రవర్తనా నియమావళిని నాన్చుతూ వచ్చిన డ్రాగన్‌ను.. ఆసియాన్ అధ్యక్ష హోదాలో ఉన్న ఫిలిప్పీన్స్ ఎట్టకేలకు 2026 గడువుకు కట్టడి చేయగలిగింది.

ఈ సమీకరణాల్లో చైనా వ్యూహాత్మక ఆత్రుతను అర్థం చేసుకోవాలంటే 'మలక్కా డైలమా' వద్దకు వెళ్లాలి. 2003లో నాటి అధ్యక్షుడు హు జింటావో తొలిసారి ప్రస్తావించిన ఈ సందిగ్ధత రెండు దశాబ్దాల తర్వాత మరింత తీవ్రరూపం దాల్చింది. చైనా దిగుమతి చేసుకునే ముడి చమురులో 80 శాతం, గ్యాస్‌లో 70 శాతం, 1.5 లక్షల కోట్ల డాలర్ల ఎగుమతులు ఈ ఒక్క జలసంధి మీదుగానే సాగుతున్నాయి. అదే మూసుకుపోతే డ్రాగన్ ఆర్థిక వ్యవస్థకు విపత్తే. సుండా, లాంబోక్ జలసంధుల చుట్టుదారులను భౌగోళిక సమస్యలు, వ్యయ–కాలహరణ భారాలు వెనక్కి నెట్టాయి. జిన్‌జియాంగ్‌ను గ్వాదర్‌తో కలిపే 6,200 కోట్ల డాలర్ల చైనా–పాకిస్థాన్ కారిడార్, క్యాక్‌ఫ్యూ నుంచి యునాన్ దాకా చైనా–మయన్మార్ కారిడార్ నిర్మించినా.. మయన్మార్ అంతర్యుద్ధంతో అవి నిరుపయోగంగా మారాయి. మరోవైపు హోర్ముజ్‌ను తెరిచి ఉంచడంలో చేదు అనుభవం చవిచూసిన అమెరికా.. మలక్కా విషయంలో ఎలాంటి అవకాశం ఇవ్వదలచుకోలేదు. ఏప్రిల్ 14న కీలక కాపలాదారు ఇండోనేసియాతో భారీ రక్షణ సహకార భాగస్వామ్యాన్ని ప్రకటించింది. 'ఇండో–పసిఫిక్ కమాండ్' నుంచి 'ఇండో'ను తొలగించి పాత 'పసిఫిక్ కమాండ్' పేరుకు మళ్లుతూ వ్యూహాత్మక సంకేతాలిచ్చింది. సింగపూర్ సమీపంలో కేవలం 2.8 కి.మీ. వెడల్పుండే ఫిలిప్స్ ఛానల్ ఈ జలసంధిలో అత్యంత బలహీన బిందువు. దాని పరిరక్షణ ప్రణాళికలకు తోడు 'అగ్రరాజ్యాల చొరబాటు నుంచి మలక్కా, దక్షిణ చైనా సముద్ర పరిరక్షణ ఆసియాన్ కేంద్రం' మే నెలలో ఏర్పాటైంది. ఇక హోర్ముజ్ మూసివేతతో మలేసియా మినహా ఆసియాన్ దేశాలన్నీ దెబ్బతిన్న నేపథ్యంలో.. అండమాన్ సముద్రంలోని రనోంగ్, థాయిలాండ్ గల్ఫ్‌లోని చుంఫోన్ నౌకాశ్రయాలను కలిపే 3,600 కోట్ల డాలర్ల భూ కారిడార్ పునరుద్ధరణను థాయ్ ప్రధాని అనుతిన్ ప్రకటించారు. లాజిస్టిక్స్ వ్యయాలను 30 శాతం తగ్గించి, రవాణా సమయాన్ని 14 రోజులు ఆదా చేసే ఈ కారిడార్‌లో పెట్టుబడిదారైన చైనాయే ప్రధాన లబ్ధిదారు కానుండగా.. సింగపూర్ తన కీలక స్థానాన్ని కోల్పోయే ప్రమాదముంది.

ఈ మహా సముద్ర చదరంగంలో భారత్ స్థానం విస్మరించలేనిది. మలక్కా పశ్చిమ ముఖద్వారాన్ని కప్పి ఉంచే 'సిక్స్ డిగ్రీ ఛానల్'కు కేవలం 40 నాటికల్ మైళ్ల దూరంలో భారత భూభాగం ఉంది. అండమాన్–నికోబార్‌లో 500 కోట్ల డాలర్లతో చేపట్టిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు వివాదాస్పదమే అయినా.. గలాతియా బే వద్ద నిర్మించే లోతైన నౌకాశ్రయం మలక్కా ప్రవేశద్వారం వద్ద అంతర్జాతీయ ట్రాన్స్‌షిప్‌మెంట్ కూడలిగా అవతరించనుంది. జూలై 4న అండమాన్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డీకే జోషి దీని వ్యూహాత్మక విలువను సమీక్షించడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యానికి నిదర్శనం. సమీపంలోని ఐఎన్ఎస్ బాజ్ స్థావరం రన్‌వే ఇప్పటికీ భారీ జెట్‌లకు అనువుగా లేకపోవడం లోటే. 1989లో ఈ స్థావర విస్తరణపై అభ్యంతరం తెలిపిన ఇండోనేసియాతో కాలచక్రం తిరిగింది. ప్రధాని మోదీ ఇటీవలి పర్యటన అపనమ్మకాల శకానికి తెరదించగా.. ఈ వారమే కుదిరిన చరిత్రాత్మక బ్రహ్మోస్ ఒప్పందం రక్షణ బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా దూకుడుకు ముకుతాడు వేయాలంటే.. హిమాలయాల్లో కాదు, మలక్కా జలాల్లో ఒత్తిడి పెంచాలన్న ఆలోచనలు వ్యూహకర్తల్లో బలంగా వినిపిస్తున్నాయి. చైనా 'మలక్కా డైలమా'ను భారత్ సానుకూలతగా మలుచుకోగలిగితే బేరసారాల శక్తి ఇబ్బడిముబ్బడవుతుందన్నది వారి తర్కం. అయితే చోక్ పాయింట్ల రాజకీయం రెండువైపులా పదునున్న కత్తి వంటిదన్న స్పృహ అవసరం. జలసంధులను ఆయుధాలుగా మార్చే ధోరణి మొదలైతే అది ఏ దేశాన్నీ వదలదన్నదే హోర్ముజ్ పాఠం. అందుకే మలక్కాను ఘర్షణ వేదిక కానివ్వకుండా నియమబద్ధ సముద్ర వ్యవస్థకు ప్రతీకగా నిలబెట్టడంలోనే అందరి శ్రేయస్సు ఉంది. సూయిజ్ నుంచి హోర్ముజ్ దాకా చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే.. సముద్ర జలసంధులను శాసించే శక్తులే రేపటి ప్రపంచ క్రమాన్ని నిర్దేశిస్తాయి. ఆ చైతన్యంతో వ్యవహరించడమే ఇండో–పసిఫిక్ యుగంలో భారత్ ముందున్న చారిత్రక కర్తవ్యం!

---

## పనికొచ్చే పలుకు



# సహనమే.. సంపూర్ణ బలం!

"ప్రకృతి నడకను అలవర్చుకోండి. దాని రహస్యం సహనం" అనే అమెరికన్ ప్రముఖ వ్యాసకర్త, అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ మాటలు నేటికీ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తాయి. జీవితంలో సాధించాల్సిన అద్భుతాలు ఏవీ క్షణాల్లో జరగవని, ప్రతి మార్పునకు ఒక సమయం పడుతుందని ఈ సూక్తి స్పష్టం చేస్తోంది. ప్రకృతి లయను నమ్ముతూ సాగే ప్రయాణమే మనిషి అంతర్గత ఎదుగుదలకు తోడ్పడుతుంది. స్థిరమైన సంకల్పంతో అడుగులు వేసినప్పుడే జీవితంలో నిజమైన తృప్తి, సఫలత లభిస్తాయి. జీవితంలో అత్యంత గొప్ప విజయాలు రాత్రికి రాత్రే సొంతం కావు. అందుకే ప్రకృతి వేగాన్ని మనం అలవర్చుకోవాలి. సహనమనేది బలహీనత కాదు, అది మనిషికి ఉండే అతిపెద్ద శక్తి అని ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి నమ్మారు. ఫలితాలు వెంటనే కంటికి కనిపించకపోయినా, నిరంతరం శ్రమించాలనేదే ఆయన సిద్ధాంతం.

ఈ సూక్తి వెనుక ఉన్న లోతైన అర్థం

నిరంతర కృషి ఎప్పటికైనా మంచి ఫలితాలను ఇస్తుందనే సత్యాన్ని ప్రకృతి మనకు నిరూపిస్తుంది. ఒక చిన్న విత్తనం వృక్షంగా మారి ఫలాలను ఇవ్వడానికి ఎంతో సమయం పడుతుంది. ఈ క్రమంలో ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడుతుంది. మనిషి జీవితం కూడా సరిగ్గా ఇలాంటిదే. ఫలితం వెంటనే రావాలనే ఆరాటంలో చాలామంది నిరాశకు లోనవుతుంటారు. కానీ, కనిపించని శ్రమ వెనుక బలమైన పునాది ఏర్పడుతుందని ఎమర్సన్ బోధించారు.

వర్తమాన కాలంలో దీని ప్రాధాన్యత

వేగాన్నే విజయంగా భావిస్తున్న ప్రస్తుత రోజుల్లో ఎమర్సన్ మాటలు మనకు దిక్సూచిలా పనిచేస్తాయి. ఇక్కడ సహనమంటే కేవలం చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. పూర్తి నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యం కోసం ఓపిగ్గా పని చేయడమే అసలైన సహనం. ప్రకృతి ఎప్పుడూ హడావుడి పడదు, కానీ సమయానికి తన పనులన్నీ పూర్తి చేస్తుంది. మన ఎదుగుదల కూడా క్రమంగానే సాగుతుంది.

షార్ట్‌కట్‌ల ద్వారా వచ్చే విజయాలు శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవు. స్థిరమైన సంకల్పంతో సాధించినప్పుడే ఆ విజయానికి అసలైన విలువ ఉంటుంది. గమ్యాన్ని చేరుకోవాలనే తొందరలో ప్రయాణంలోని పాఠాలను మర్చిపోకూడదు. ఎమర్సన్ చెప్పినట్లు ప్రకృతి నడకను మనం అందిపుచ్చుకుంటే, మన బంధాలు బలపడతాయి, నైపుణ్యాలు మెరుగవుతాయి, వ్యక్తిగత ఎదుగుదలకు అర్థం లభిస్తుంది. సహనమనేది నిష్క్రియగా వేచి ఉండటం కాదు, ప్రతి నిజాయితీగల ప్రయత్నం సరైన సమయంలో అద్భుతంగా వికసిస్తుందనే నిశ్శబ్ద నమ్మకం.

రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ప్రస్థానం

వ్యక్తిగత స్వేచ్ఛను, హేతుబద్ధమైన ఆలోచనలను బలంగా వినిపించిన ఎమర్సన్, అమెరికన్ రొమాంటిక్ మూవ్‌మెంట్‌లో కీలక వ్యక్తిగా నిలిచారు. ఆయన రాసిన "సెల్ఫ్–రిలయన్స్", "ది ఓవర్–సోల్", "సర్కిల్స్", "ది పోయెట్", "ఎక్స్‌పీరియన్స్" వంటి వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. ఇవన్నీ ఎస్సేస్: ఫస్ట్ సిరీస్ (1841), ఎస్సేస్: సెకండ్ సిరీస్ (1844) సంకలనాల్లో భాగం. ప్రసిద్ధ తత్వవేత్త హెన్రీ డేవిడ్ థోరోకు ఆయన గురువుగా, ప్రాణస్నేహితుడిగా వ్యవహరించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందిన ఎమర్సన్, 1836లో 'నేచర్' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఆ తర్వాత 1837లో హార్వర్డ్ కాలేజీలోని ఫి బేటా కప్పా సొసైటీలో "ది అమెరికన్ స్కాలర్" అనే ప్రసిద్ధ ప్రసంగాన్ని చేశారు.

---

# సంగమ సంకల్పం.. సంపద సృష్టి!




గోదావరి ఏటా వేల టీఎంసీ జలాలను వృథాగా సముద్రం పాలు చేస్తుంటే.. రాయలసీమ నేలలు చుక్కనీటి కోసం తపిస్తున్నాయి. ఈ వైరుధ్యానికి పరిష్కారమే నదుల అనుసంధానమన్నది దశాబ్దాల ఆలోచన. దాన్ని ఆచరణలోకి తెచ్చే మహాయజ్ఞానికి ఏపీ మరోసారి వేదికవుతోంది. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా–గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు.. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించడం రాష్ట్ర జలచరిత్రలో కీలక ఘట్టం. "అనుసంధానం పూర్తయితే రాష్ట్రానికి కరవుండదు" అన్న బాబు మాట ఈ యజ్ఞం వెనుక ఉన్న మౌలిక దృష్టిని ఆవిష్కరిస్తోంది. 2014లో విభజిత రాష్ట్ర తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే పూర్తి చేసిన పట్టిసీమ ఎత్తిపోతల –గోదావరి జలాలను పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణమ్మకు చేర్చడంతో.. దేశంలోనే అనుసంధానాన్ని ఆచరణాత్మకంగా నిరూపించిన తొలి ప్రయోగంగా చరిత్రకెక్కింది. కృష్ణా డెల్టా స్థిరీకరణకు ఆ జలాలు అండగా నిలవగా, శ్రీశైలం జలాలను సీమ అవసరాలకు మళ్లించే వెసులుబాటూ లభించింది. ఆనాటి విజయమే నేటి విస్తృత ప్రణాళికలకు ఆత్మవిశ్వాస పునాది. చంద్రబాబు సంకల్పంలోని మరో విశేషం రాష్ట్ర సరిహద్దులు దాటిన జాతీయ దృక్పథం. "గంగా–కావేరి అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదు" అన్న ఆయన వ్యాఖ్య ఇందుకు అద్దం. గోదావరి–కావేరి అనుసంధానంపై కేంద్రం యోచిస్తున్న వేళ.. కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు ఒకే వేదికపైకి రావడాన్ని చారిత్రక ఘట్టంగా అభివర్ణించిన ఆయన.. కేన్–బెత్వా తరహాలో ఈ అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అపార ప్రయోజనాలంటూ అనుసంధాన ఉద్యమానికి జాతీయ నేతృత్వం వహించాలన్న ఆకాంక్షను చాటారు.

ఈ ప్రస్థానంలో పోలవరం కేంద్రబిందువు. "పోలవరం రాష్ట్రానికి జీవనాడి" అంటున్న ముఖ్యమంత్రి.. మార్చి 2027 నాటికి ప్రాజెక్టును వందశాతం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టమైన గడువు ప్రకటించారు. గత హయాంలో నత్తనడకన సాగి, డయాఫ్రం వాల్ దెబ్బతిని సంక్షోభంలో పడిన ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించడం, కేంద్ర నిధులు రాబట్టడం, విదేశీ నిపుణుల సలహాలతో సాంకేతిక సమస్యలను అధిగమించడం గమనార్హం. పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 28.5 లక్షల మందికి తాగునీరు అందుతాయని అంచనా. ఎడమ కాలువ పనులు పూర్తికావడంతో ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇవ్వనున్నట్టు సీఎం ప్రకటించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా అనకాపల్లి, విశాఖలకు నీళ్లందించి, ఆపై గోదావరి–నాగావళి అనుసంధానం చేపడతామన్న రూట్‌మ్యాప్ కూడా వినిపించింది. వెలిగొండ ఫేజ్–1ను సెప్టెంబరు 1న జాతికి అంకితం చేయనుండటం ప్రకాశం జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు పెద్ద ఊరట. ఇక ఈ యజ్ఞంలో తలమానికం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు. పోలవరం వద్ద గోదావరి వరద జలాలను కృష్ణాలోకి, అక్కడి నుంచి బొల్లాపల్లి జలాశయానికి, ఆపై నల్లమల మీదుగా బనకచర్లకు తరలించి ఏటా 200 టీఎంసీ వరద జలాలను ఒడిసిపట్టాలన్నది బృహత్ ప్రణాళిక. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో మూడు దశల్లో దీన్ని చేపట్టనుండగా, సీఎం చైర్మన్‌గా 'జలహారతి కార్పొరేషన్' ఏర్పాటు ప్రభుత్వ చిత్తశుద్ధికి సంకేతం. బనకచర్ల జలాలు తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి వ్యవస్థల ద్వారా సీమ నలుమూలలకూ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకూ విస్తరిస్తే.. వలసబాట పట్టే సీమపల్లెల తలరాత మారుతుంది. అనుసంధాన ప్రయోజనాలు అనూహ్యమైనవి. వర్షాధార భూముల్లో పంట అనిశ్చితికి, రైతు ఆత్మహత్యలకు, వలసలకు వరద జలాలతో చెరువులు నింపడం ద్వారా అడ్డుకట్ట పడుతుంది. ఫ్లోరైడ్, ఉప్పునీటి బాధిత ప్రాంతాలకు నదీజలాలే శాశ్వత పరిష్కారం. నీటి లభ్యత పెరిగితే పంటల విస్తీర్ణం, దిగుబడులు పెరిగి.. ఉద్యాన, ఆక్వా, పాడి వంటి అధిక విలువ రంగాలకు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు, డేటా సెంటర్ల వంటి కొత్తతరం పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. అంటే అనుసంధానం కేవలం సాగునీటి పథకం కాదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రక్రియ. 'ప్రతి ఎకరాకూ నీరు' సాకారమైతే జీఎస్‌డీపీలో వ్యవసాయ వాటా పరుగులు పెడుతుంది. నీటి నిర్వహణలో ముందున్న సమాజాలే సంపద సృష్టిలోనూ ముందుంటాయన్నది ప్రపంచానుభవం. ఈ కోణంలో ఈ స్వప్నాన్ని 'స్వర్ణాంధ్ర–2047' విజన్‌లో అంతర్భాగంగా చూడాలి.

అయితే ఈ బృహత్ స్వప్నం ముందున్న సవాళ్లనూ నిష్పాక్షికంగా గుర్తించాలి. మొదటిది నిధుల సమస్య. బనకచర్లకు రూ.81,900 కోట్లు, 36 ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు అంటే.. అప్పుల భారం, సంక్షేమ వ్యయాల ఒత్తిడి మధ్య ఉన్న ఖజానాకు భారీ పరీక్ష. కేంద్ర సాయం, హైబ్రిడ్ ఫండింగ్, అంతర్జాతీయ రుణ సంస్థల భాగస్వామ్యం లేకుండా ఇది సాగదు. రెండోది అంతర్రాష్ట్ర వివాదాలు. గోదావరిలో తమ వాటాకు గండి పడుతుందని, ట్రైబ్యునల్ కేటాయింపులకు విరుద్ధమని బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలు సుప్రీంకోర్టు దాకా వెళ్లాయి. 'వరద జలాలే తీసుకుంటాం, ఎవరి వాటాకూ నష్టం లేదు' అన్న ఏపీ వాదనకు.. ఏటా మూడు వేల టీఎంసీలకు పైగా జలాలు సముద్రం పాలవుతున్న గణాంకాల బలముంది. కానీ జల వివాదాల చరిత్ర చెప్పే పాఠం.. సాంకేతిక వాస్తవాల కంటే రాజకీయ విశ్వాసమే కీలకం. మూడోది పర్యావరణ, పునరావాస సవాళ్లు. నల్లమల మీదుగా టన్నెళ్లు, భారీ జలాశయాల నిర్మాణం అటవీ, వన్యప్రాణి అనుమతుల పరీక్షలు దాటాలి. ముంపు గ్రామాల పునరావాసం మానవీయంగా జరగాలి.. పోలవరం నిర్వాసితుల అనుభవాలు ఇక్కడ గుణపాఠాలు. నాలుగోది.. నదులు నీటి పైపులు కావని, జీవావరణ వ్యవస్థలని, వరద మళ్లింపు డెల్టాలపై, భూగర్భ జలాలపై ప్రభావం చూపవచ్చన్న నిపుణుల మౌలిక ప్రశ్న. ఈ సందేహాలకు సమాధానం సిద్ధాంత చర్చల్లో కాదు, జాగ్రత్తతో కూడిన ఆచరణలోనే దొరుకుతుంది. పట్టిసీమతో ఏపీ, కేన్–బెత్వాతో దేశం అనుసంధాన సాధ్యతను నిరూపించాయి. కావాల్సిందల్లా ప్రతి దశలో శాస్త్రీయ అధ్యయనాలు, పర్యావరణ మదింపులు, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ. వరద జలాలకే పరిమితమవుతూ, దిగువ డెల్టాలను కాపాడుతూ, భాగస్వామ్య రాష్ట్రాలతో నిరంతర సంప్రదింపులతో సాగితే ప్రాజెక్టు వివాదాల ఊబిలో కూరుకుపోదు.

ప్రకటనల్లో వేగం ఎంత ముఖ్యమో, నాణ్యతలో రాజీపడని నిదానమూ అంతే ముఖ్యమన్నదానికి పోలవరం డయాఫ్రం వాల్ అనుభవమే శాశ్వత హెచ్చరిక. భారీ ప్రాజెక్టుల వెలుగులో చెరువుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి, సూక్ష్మసేద్యం వంటి చిన్ననీటి వ్యూహాలను విస్మరించరాదు. తెచ్చిన నీటిని పొదుపుగా వాడే సంస్కృతి లేకపోతే ఎన్ని నదులు కలిపినా దాహం తీరదు. మొత్తంగా.. వృథా జలాలను వరప్రసాదాలుగా మార్చాలన్న చంద్రబాబు సంకల్పం ఔచిత్యంలో ప్రశ్నార్థం కాదు, ప్రశ్నలన్నీ అమలు మార్గంలోనే. నిధుల క్రమశిక్షణ, పొరుగు రాష్ట్రాలతో సఖ్యత, పర్యావరణ బాధ్యత, పారదర్శకత అనే నాలుగు స్తంభాలపై ఈ జలయజ్ఞం నడిస్తే.. పోలవరం జాతికి అంకితమయ్యే క్షణం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమవుతుంది. సంగమం వద్ద ఇచ్చిన జలహారతి.. తరతరాల కరవు కథకు ముగింపు పలికే మంగళహారతి కావాలని ఆకాంక్షిద్దాం. నదులు కలిస్తే నీరే కాదు, ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాలూ కలిసిపోతాయి. అదే ఈ మహాసంకల్పానికి అసలైన సార్థకత! ■

---



వారాంతపు పార్టీలకో, సినిమాలకో, మందు విందులకో వేలు ఖర్చు చేస్తే.. "భలే ఎంజాయ్ చేస్తున్నావ్" అని మెచ్చుకుంటుంది ఈ లోకం. అదే డబ్బును వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టినా, కొత్త నైపుణ్యం నేర్చుకోవడానికి వెచ్చించినా.. "అంత రిస్క్ ఎందుకు?" అంటూ భయపెడుతుంది. వినోదానికి వెచ్చిస్తే వివేకం, ఎదుగుదలకు వెచ్చిస్తే అవివేకం అనుకునే ఈ ఆలోచనే అసలైన విచిత్రం! సో, లోకం మాటలు పక్కనపెట్టండి. క్షణికానందం ఖర్చయిపోతుంది.. కానీ మీపై మీరు పెట్టే పెట్టుబడి వడ్డీతో సహా తిరిగొస్తుంది. ఖర్చుకూ పెట్టుబడికీ తేడా తెలిసిన రోజే.. మీ ఎదుగుదలకు తొలి మెట్టు పడినట్టు!

-మహాదేవ

---

## వింతల్లో వింతలు



# అరచేతిలో అద్భుతం!

గంటలు, నిమిషాలు, సెకన్లు చూపడం దాటి గడియారంలో ఉండే ప్రతి అదనపు ఫీచర్‌ను హోరాలజీ భాషలో 'కాంప్లికేషన్' అంటారు. తేదీ, అలారం, స్టాప్‌వాచ్ ఇలాంటివే. మరి ఏకంగా 63 కాంప్లికేషన్లున్న గడియారం గురించి విన్నారా? స్విస్ దిగ్గజం వాచరాన్ కాన్‌స్టాంటిన్ రూపొందించిన 'బెర్క్‌లీ గ్రాండ్ కాంప్లికేషన్' పాకెట్ వాచ్.. ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన గడియారంగా చరిత్ర సృష్టించింది. 2015లో ఓ అజ్ఞాత కలెక్టర్ కోసం ఎనిమిదేళ్లు శ్రమించి తయారు చేసిన 'రిఫరెన్స్ 57260' దీనికి పునాది. 18 క్యారెట్ల తెల్ల బంగారు కేసులో, కేవలం రెండు అంగుళాల వ్యాసంలో 2,870 సూక్ష్మ యాంత్రిక భాగాలను ఇమిడ్చిన ఈ 960 గ్రాముల అద్భుతం.. అంతకుముందు రికార్డు సాధించిన పటేక్ ఫిలిప్ 'క్యాలిబర్ 89' (33 కాంప్లికేషన్లు) కంటే దాదాపు రెట్టింపు ఫీచర్లతో అబ్బురపరుస్తోంది. దీని ధర గోప్యమే అయినా.. 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ.85 కోట్లు) పైమాటేనని నిపుణుల అంచనా. కాలం గడిచేకొద్దీ దీని విలువ మరింత పెరగడం ఖాయమంటున్నారు!

# 2027 నుంచి కొత్త మైలేజ్ నిబంధనలు, ఈవీలు--హైబ్రిడ్ కార్లకు భారీ ప్రోత్సాహం!

భారత్‌లో ఇంధన వాడకాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ఎలక్ట్రిక్ వాహనాలు వాడటాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ దిశగా విద్యుత్ మంత్రిత్వ శాఖ 2027 కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ(జాఫీజు-×××) నిబంధనల ముసాయిదాను విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తే కార్ల తయారీ కంపెనీలు మరింత ఇంధన సామర్థ్యం ఉన్న మైలేజీ ఎక్కువగా ఇచ్చే వెహికల్స్ మార్కెట్లోకి తీసుకురావాల్సి ఉంటుంది.



**మైలేజ్‌పై కఠిన నిబంధనలు..**

కొత్త రూల్స్ ప్రకారం 2027-28 నుంచి 2031-32 వరకు ప్రతి ఏడాది కార్ల సగటు ఇంధన వినియోగ ప్రమాణాలను మరింత కఠినతరం చేస్తారు. అంటే ఆటో సంస్థలు విక్రయించే మొత్తం కార్ల సగటు మైలేజ్‌ను నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలి. లక్ష్యాలను అందుకోలేకపోతే ప్రత్యేక క్రెడిట్లను ఇతర కంపెనీల నుంచి కొనుగోలు చేయడం, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఇది కంపెనీలకు పెద్ద భారమే.

**ఈవీలు, హైబ్రిడ్ కార్లకు భారీ ప్రయోజనం..**

ఈ ముసాయిదాలో అత్యంత కీలక మార్పు ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు ఇచ్చిన ప్రోత్సాహం అని చెప్పుకోవాలి. బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం, రేంజ్ ఎక్స్‌టెండెడ్ ఈవీ ఒక్కోటి నిబంధనల లెక్కల్లో 3 వాహనాలుగా పరిగణిస్తారు. ప్లగ్-ఇన్ హైబ్రిడ్, ఫ్లెక్స్-ఫ్యూయల్ హైబ్రిడ్ కార్లకు 2.5 రెట్లు, స్ట్రాంగ్ హైబ్రిడ్ కార్లకు 1.6 రెట్లు ప్రయోజనం లభిస్తుంది. దీంతో ఈ తరహా వాహనాలను తయారు చేసే కంపెనీలకు నిబంధనలు పాటించడం మరింత ఈజీ అవుతుంది.

**ఈ20, సీఎన్‌జీ వాహనాలకు కూడా ఊరట..**

మొదటిసారిగా ఈ20 ఇంధనం, సీఎన్‌జీ, బయోఫ్యూయల్స్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు కూడా కార్బన్ న్యూట్రాలిటీ ప్రయోజనాలను ప్రభుత్వం గుర్తించింది. ఈ20కు అనుకూలమైన కార్లకు కార్బన్ ఉద్గారాల లెక్కల్లో 8 శాతం తగ్గింపు ప్రయోజనం లభిస్తుంది. ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలకు ఇది 22.3 శాతం వరకు ఉంటుంది. సీఎన్‌జీ వాహనాలకు కూడా 5 శాతం వరకు ప్రత్యేక ప్రయోజనం కల్పించనున్నారు.

**కొత్త టెక్నాలజీలకు ప్రోత్సాహం..**

ఆటోమేటిక్ స్టార్ట్-స్టాప్ సిస్టమ్, టైర్ ప్రెషర్ మానిటరింగ్, రీజెనరేటివ్ బ్రేకింగ్, ఆరు లేదా అంతకంటే ఎక్కువ గేర్ల ట్రాన్స్‌మిషన్, ఎల్ఈడీ లైటింగ్, ఇంధనాన్ని ఆదా చేసే ఏసీ, సోలార్ రిఫ్లెక్టివ్ పెయింట్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే కంపెనీలకు కూడా అదనపు ప్రయోజనాలు ఇవ్వనున్నారు.

**వినియోగదారులపై ప్రభావం ఏంటి?**

ఈ కొత్త రూల్స్ వల్ల రానున్న రోజుల్లో మరింత మైలేజ్ ఇచ్చే, తక్కువ కాలుష్యం విడుదల చేసే కార్లు మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్, హైబ్రిడ్, సీఎన్‌జీ, ఈ20 అనుకూల వాహనాల తయారీకి ఊతం లభిస్తుంది. చిన్న తయారీ సంస్థలకు మాత్రం సంవత్సరానికి వెయ్యి కంటే తక్కువ కార్లు విక్రయిస్తే ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. మొత్తంగా చూస్తే భారత ఆటోమొబైల్ రంగాన్ని పరిశుభ్రమైన, ఇంధన పొదుపు దిశగా తీసుకెళ్లేందుకు ఈ కొత్త జాఫీజు-××× నిబంధనలు కీలక మలుపుగా మారనున్నాయి.

# E20 పెట్రోల్ కల్తీకి ఇథనాలే కారణమా?.. పెట్రోల్ బంక్ ఓనర్స్ బయటపెట్టిన నిజం

E20 పెట్రోల్‌కు సంబంధించిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్న వేళ.. పెట్రోల్ బంక్ ఓనర్స్ కీలక అంశాలను వెల్లడిస్తున్నారు. E20లో ఉండే 20 శాతం ఇథనాల్ స్వభావం వల్లే వర్షాకాలంలో పెట్రోల్ కలుషితమయ్యే ప్రమాదం పెరుగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న భూగర్భ స్టోరేజీ ట్యాంకులు సాధారణ పెట్రోల్ కోసం రూపొందించబడ్డాయని, అధిక ఇథనాల్ కలిపిన పెట్రోల్ స్టోర్ చేయడానికి పూర్తిగా అనుకూలంగా లేవని వారు చెబుతున్నారు.




**ఇథనాల్‌కు నీటితో ఉన్న సంబంధం..**

ఇథనాల్‌కు నీటిని సులభంగా గ్రహించే హైగ్రోస్కోపిక్ గుణం ఉంటుంది. వర్షాకాలంలో భూగర్భ ట్యాంకుల్లో వర్షపు నీరు, తేమ, ఘనీభవనం, ట్యాంకర్ల ద్వారా స్వల్పంగా నీరు చేరే అవకాశం ఉంటుంది. ఈ20లో నీటి శాతం 0.5 శాతానికి మించి పెరిగితే, ఇథనాల్ నీటితో కలిసిపోతుంది. దీంతో "ఫేజ్ సెపరేషన్" అనే ప్రక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియలో నీరు-ఇథనాల్ మిశ్రమం ట్యాంక్ అడుగుభాగంలో చేరిపోగా, పెట్రోల్ పైభాగంలో విడిగా స్టోర్ అవుతుందన్నమాట. అంటే రెండు వేరువేరుగా విడిపోతాయ్.

**వాహనాలకు ఎలా చేరుతోంది?**

పెట్రోల్ పంపుల్లో ఇంధనం భూగర్భ ట్యాంక్ అడుగుభాగం నుంచి పైపు ద్వారా పంప్ చేయబడుతుంది. దీంతో కొన్ని సందర్భాల్లో పెట్రోల్‌కు బదులుగా నీరు అధికంగా ఉన్న ఇథనాల్ మాత్రమే వాహనాల్లోకి పెట్రోల్ పట్టించుకోవటానికి వెళ్లినప్పుడు మన వాహనంలోకి వస్తాయని బంక్ యజమానులు చెబుతున్నారు. అలాంటి పెట్రోల్ వల్ల వాహనం స్టార్ట్ కాకపోవడం, కొంతదూరం వెళ్లాక ఆగిపోవడం, ఇంజిన్ పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లోని పెట్రోలు బంకుల్లో భూగర్భ జలాలు స్టోరేజీ ట్యాంకుల్లోకి చేరే అవకాశం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని వివరిస్తున్నారు.

**బంక్ యజమానుల ఆందోళనలు.. ఐఓసీఎల్ స్పందన**

వర్షాకాలంలో భూగర్భ ట్యాంకుల్లో రోజుకు 3 సార్లు, భారీ వర్షాల సమయంలో ప్రతి 2 గంటలకు ఒకసారి నీటి పరీక్షలు నిర్వహించాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయని బంక్ నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో నీరు చేరటం వల్ల కలుషితమైన ఇంధనాన్ని తొలగించాల్సి వస్తే ఆ నష్టాన్ని తామే భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వందల లీటర్లు, మరికొందరు వేల లీటర్ల వరకు పెట్రోలు నష్టపోయినట్లు చెబుతున్నారు. తమకు పెట్రోల్ అమ్మితే వచ్చే మార్జిన్ లాభం కంటే ఈ నష్టాలే కొండలా పేరుకుపోతున్నాయని, ఇలా అయితే బంకులు నడపలేం అని చేతులెత్తేస్తున్నారు.

అయితే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మాత్రం పెట్రోల్ నాణ్యత విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెబుతోంది. దేశవ్యాప్తంగా వేలాది ఆకస్మిక తనిఖీలు, నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా కలుషితం లేదా నాణ్యత లోపం తేలితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. బంక్ ఓనర్ల చేతిలో లేని అంశాన్ని వారిపై రుద్దటం దానివల్ల లాభాలకు పోయి నష్టాలు రావటం ఇబ్బందిగా మారిందని చాలా మంది డీలర్లు అంటున్నారు. అయితే దీనికి సాంకేతికత ద్వారానే పరిష్కారం కనుకొనాలను చాలా మంది కోరుతున్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ స్టోరేజీకి అనుకూలమైన ట్యాంకులు అవసరం అని వారు చెబుతున్నారు. ఇదే ఇలా ఉంటే రానున్న రోజుల్లో బ్యూటనాల్ కలిపిన డీజిల్ వస్తే ఇంకెలాంటి సమస్యలు తమకు చుట్టుకుంటాయో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# స్విగ్గీపై ఎంపీ మహువా మొయిత్రా ఫైర్.. ఆర్డర్ క్యాన్సిల్ చేసి రూ.1,457 వసూలు చేశారని పోస్ట్!




తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాకు ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీతో ఎదురైన అనుభవం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్విగ్గీలో ఆర్డర్ చేసిన భోజనం మూడోసారి కూడా క్యాన్సిల్ కావడంతో పాటు, తన నుంచి మొత్తం రూ.1,457 క్యాన్సిలేషన్ ఫీజుగా వసూలు చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం అందలేదని, సమస్య పరిష్కరించేందుకు సరైన కస్టమర్ సపోర్ట్ కూడా లభించలేదని ఆమె సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.స్విగ్గీ గౌర్మెట్ ద్వారా ఆర్సలాన్ రెస్టారెంట్ నుంచి ఆర్డర్ చేసినట్లు లేడీ ఎంపీ వెల్లడించారు. అయితే ఆ ఆర్డర్‌ను స్విగ్గీ రద్దు చేసినట్లు ఈమెయిల్ ద్వారా సమాచారం అందిందని, ఆర్డర్ నంబర్ 243092360048928ను జూలై 15న రాత్రి 7:55 గంటలకు రద్దు చేసినట్లు, రెస్టారెంట్ సర్వీస్ పేరుతో రూ.1,457 క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని మెయిల్‌లో పేర్కొన్నట్లు మహువా మొయిత్రా వెల్లడించారు.

ఈ విషయాన్ని మహువా ఎక్స్‌లో ప్రస్తావించడంతో పలువురు వినియోగదారులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. కొందరు ఆర్డర్లు టెక్నికల్ సమస్యల కారణంగా రద్దయ్యాయని, అయినా రీఫండ్ ఆలస్యం అవుతోందని ఫిర్యాదు చేశారు. ఒక వినియోగదారు ౧
తన రూ.2వేల765 ఇన్‌స్టామార్ట్ ఆర్డర్ కూడా సాంకేతిక సమస్య కారణంగా రద్దయిందని షేర్ చేసుకున్నారు.

అయితే మహువా మొయిత్రా ఫిర్యాదుపై స్విగ్గీ స్పందించింది. ఆమె అసంతృప్తిని అర్థం చేసుకున్నామని.. ఆర్డర్ రద్దు, వసూలైన ఛార్జీలపై పరిశీలించి పరిష్కారం చూపుతామని కంపెనీ ఎక్స్‌లో రిప్లై ఇచ్చింది. అయితే వినియోగదారుడి తప్పు లేకుండా ప్లాట్‌ఫామ్ వైపు నుంచి ఆర్డర్లు రద్దయినప్పుడు పూర్తి మొత్తాన్ని క్యాన్సిలేషన్ ఫీజుగా వసూలు చేయడం సరైనదేనా అనే చర్చ స్విగ్గీ చేసిన పనిపై నెట్టింట కొనసాగుతోంది. ఒక ఎంపీకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్య కష్టమర్లకు కనీసం జవాబు చెప్పేది ఎవరంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు.

# "డబ్బు కోసం కాదు.. మీ సైలెన్స్ వల్లే ఉద్యోగం వదిలా".. సీఈఓకు ఉద్యోగిని చెప్పిన మాటలు వైరల్!




ఉద్యోగులు ఎక్కువ జీతం, పెద్ద పొజిషన్ కోసం కంపెనీ మారుతారనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. కానీ ఓ కంపెనీ సీఈఓకు తన సంస్థలోని అత్యుత్తమ ఉద్యోగిని వెళ్లిపోతూ చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాలుగేళ్ల పాటు పనిచేసి, 2 సార్లు ప్రమోషన్ పొందిన ఆ ఉద్యోగిని రాజీనామా చేయడంతో సీఈఓ ఎగ్జిట్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎక్కువ జీతం లేదా మంచి ఆఫర్ వచ్చి ఉంటుందని భావించిన ఆయనకు ఊహించని సమాధానం ఎదురయ్యాయి.ఆ ఉద్యోగిని మాట్లాడుతూ.. "నేను డబ్బు కోసం ఉద్యోగం వదల్లేదు. రెండేళ్లుగా నా పనిభారాన్ని కొంచెం తగ్గించాలని కోరుతున్నాను. ప్రతిసారీ నా అభ్యర్థనను స్వీకరించి పరిశీలిస్తామని చెప్పారు. కానీ ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని ఆమె చెప్పింది. చివరకు మరో కంపెనీ ఇంటర్వ్యూలో తన అవసరాన్ని గుర్తించి స్పందించడంతో అక్కడ చేరాలని నిర్ణయించుకున్నట్లు ఎగ్జిట్ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలు ఆ కంపెనీ సీఈఓ కళ్లు తెరిపించాయి.ఈ సంఘటన తన ఆలోచననే మార్చేసిందని సీఈఓ అల్పేష్ వఘాసియా లింక్డ్‌ఇన్‌లో రాశారు. ఉద్యోగి కోరిన విషయాన్ని రికార్డులో నమోదు చేయడం మాత్రమే సరిపోదని, దానికి సమాధానం చెప్పే బాధ్యత కూడా ఎవరికో ఉండాలని చెప్పారు. "ఒక అభ్యర్థనను నమోదు చేయడం అంటే దానికి స్పందించినట్టే అనుకోవడం తప్పు. సమాధానం లేని అభ్యర్థన అంటే మర్యాదపూర్వకంగా చెప్పిన 'నో'తో సమానం" అని సీఈఓ పేర్కొన్నారు.ఈ ఘటన తర్వాత తమ కంపెనీలో విధానాలను పూర్తిగా మార్చినట్లు సీఈఓ చెప్పారు. ఇకపై ఉద్యోగి చేసే ప్రతి అభ్యర్థనకు ఒక బాధ్యుడిని, సమాధానం చెప్పాల్సిన గడువును నిర్ణయించామని చెప్పారు. "అది సాధ్యం కాదని చెప్పినా ఉద్యోగులు అర్థం చేసుకుంటారు. కానీ ఎలాంటి స్పందన లేకపోవడాన్నే వారు ఎక్కువగా భరించలేరు" అని సీఈఓ పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టుకు వేలాది మంది స్పందిస్తూ, ఉద్యోగులు కంపెనీలను కాదు.. తమ మాట వినిపించకపోవడాన్నే ఎక్కువగా వదిలి వెళ్తారని అభిప్రాయపడుతున్నారు.

# జేడీ వాన్స్‌కు ఇరాన్ రహస్య సందేశం? ట్రంప్ బృందంపై 'యుద్ధ లాభాల' ఆరోపణలు!



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్‌పై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసినట్లు ఓ నివేదిక వెల్లడించింది. యుద్ధాన్ని ముగించే చర్చల సమాచారాన్ని ఉపయోగించి ఆర్థిక లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఇరాన్ ఆరోపించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలను వైట్‌హౌస్ తీవ్రంగా ఖండించింది.

**జేడీ వాన్స్‌కు రహస్య సందేశం పంపిందా ఇరాన్?**

జూన్ చివరిలో స్విట్జర్లాండ్‌లోని లేక్ లూసెర్న్‌లో జరిగిన అమెరికా-ఇరాన్ చర్చల సమయంలో మధ్యవర్తి ద్వారా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు ఇరాన్ ఓ సందేశాన్ని పంపినట్లు పేర్కొంది. విట్‌కాఫ్, కుష్నర్ కొనసాగుతున్న చర్చల్లో కీలక పాత్ర పోషిస్తే శాంతి ఒప్పందం సాధించే ప్రయత్నాలకు నష్టం కలుగుతుందని ఇరాన్ హెచ్చరించినట్లు తెలిపింది. ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తమ వద్ద ఉన్న సమాచారాన్ని మధ్యవర్తుల ద్వారా అమెరికాకు చేరవేశామని పేర్కొన్నారు. చర్చల వివరాలు ఆర్థిక మార్కెట్లలో ప్రయోజనం పొందేందుకు ఉపయోగించబడుతున్నాయనే అనుమానాలను కూడా వ్యక్తం చేసినట్లు రిపోర్ట్స్ వచ్చాయి.

**9 బిలియన్ డాలర్ల లాభాల ఆరోపణ..**

ఇరాన్ అందించినట్లు చెబుతున్న పత్రాల్లో, అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, దౌత్య పరిణామాలను ఆధారంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు మార్కెట్లను ప్రభావితం చేశారని ఆరోపించినట్లు సమాచారం. ఈ పరిణామాల ద్వారా దాదాపు 9 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.లక్ష కోట్లు లాభాలు వచ్చాయని ఇరాన్ అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. అందులో 4.5 బిలియన్ డాలర్లు తమకు కేటాయించాలని ఇరాన్ డిమాండ్ చేసినట్లు తెలిపింది.

**చమురు ధరలు, మార్కెట్లపై అనుమానాలు..**

అమెరికా-ఇరాన్ ఘర్షణల సమయంలో చమురు ధరలు, ఎనర్జీ కంపెనీల షేర్లు, ఇతర మార్కెట్లలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్ని సందర్భాల్లో కీలక రాజకీయ ప్రకటనలకు ముందు మార్కెట్లలో అసాధారణ కదలికలు కనిపించాయని విశ్లేషకులు పేర్కొన్నట్లు నివేదిక తెలిపింది. అయితే ఇవి అంతర్గత సమాచారం ఆధారంగా జరిగిన ట్రేడింగ్ అని నిరూపించే ఆధారాలు లేవని కూడా స్పష్టం చేసింది.

**వైట్‌హౌస్ ఖండన..**

ఇరాన్ ఆరోపణలను అమెరికా వైట్‌హౌస్ పూర్తిగా తిరస్కరించింది. జేడీ వాన్స్‌కు అలాంటి సందేశం ఏదీ ఇరాన్ నుంచి అందలేదని, ట్రంప్ బృంద సభ్యులు అధ్యక్షుడి విధానాలను అమలు చేయడం తప్ప మరే ఇతర ఉద్దేశాలతో పనిచేయడం లేదని స్పష్టం చేసింది. విట్‌కాఫ్, కుష్నర్ మాత్రం ఈ ఆరోపణలపై బహిరంగంగా స్పందించలేదు.

**వాన్స్‌పై ఇరాన్ నమ్మకం ఎందుకు?**

అమెరికా చర్చల బృందంలోని ఇతర సభ్యులతో పోలిస్తే జేడీ వాన్స్ మరింత చర్చలకు అనుకూలంగా ఉంటారని ఇరాన్ భావించినట్లు సమాచారం. అందుకే ఆయనతో ప్రత్యేక సంప్రదింపుల మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. మాజీ అమెరికా ఇరాన్ చర్చల ప్రతినిధి రాబర్ట్ మాలీ కూడా ఇరాన్ నేరుగా వాన్స్‌తో సంబంధాలు ఏర్పరుచుకోవాలనుకోవడం సహజమేనని వ్యాఖ్యానించారు. అయితే అమెరికా విదేశాంగ విధానాన్ని ఒక్క ఉపాధ్యక్షుడు మాత్రమే నిర్ణయించలేరని అన్నారు. ఇరాన్ ఆరోపణలు నిజమా కాదా అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికే సంక్లిష్టంగా ఉన్న అమెరికా-ఇరాన్ దౌత్య సంబంధాల్లో కొత్త రాజకీయ తుఫాన్‌ను రేపాయి.

# హైబీపీ ఎంత ఉందో లెక్కించాలంటే ఒక్కసారి రీడింగ్ సరిపోదు.. మరి ఏం చేయాలి..?

రక్తపోటు (హైబీపీ) గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. అయినప్పటికీ చాలామంది సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్ష చేయించుకునే సమయంలో మాత్రమే రక్తపోటును పరీక్షించుకుంటారు. అయితే ఒక్కసారి తీసిన బీపీ రీడింగ్‌పై మాత్రమే ఆధారపడటం సరైన నిర్ణయం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తపోటు అసలు స్థాయిని తెలుసుకోవాలంటే క్రమం తప్పకుండా కొలవడం అవసరమని సూచిస్తున్నారు. ఆసుపత్రి లేదా వైద్యుల క్లినిక్‌లో కొలిచే రక్తపోటు కొన్నిసార్లు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. దీనికి ప్రధాన కారణం వైట్ కోట్ సిండ్రోమ్. కొంతమంది ఆసుపత్రి వాతావరణంలో ఆందోళన, భయం లేదా ఒత్తిడికి గురవుతారు. ఈ మానసిక ఒత్తిడి కారణంగా తాత్కాలికంగా రక్తపోటు పెరిగి, సాధారణం కంటే ఎక్కువ రీడింగ్ నమోదయ్యే అవకాశం ఉంటుంది.




### ఇలా చేయాలి..

ఈ కారణంగా సంవత్సరానికి ఒకసారి తీసిన ఒక్క రీడింగ్ ఆధారంగా ఆరోగ్య నిర్ణయాలు తీసుకోవడం కంటే, ఇంట్లోనే క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల నిజమైన సగటు రక్తపోటు స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం 2-2-7 పద్ధతిని అనుసరించాలని సూచిస్తున్నారు. ఈ విధానంలో ఇంట్లో ఉపయోగించే ఆర్మ్ బ్లడ్ ప్రెజర్ మానిటర్‌తో ఉదయం, సాయంత్రం రోజుకు రెండుసార్లు రక్తపోటు కొలవాలి. ఇలా వరుసగా ఏడు రోజుల పాటు నమోదైన అన్ని రీడింగ్‌లను రాసి, వాటి సగటును లెక్కించాలి. ఈ సగటు విలువే వ్యక్తి వాస్తవ రక్తపోటు స్థాయిని మరింత కచ్చితంగా తెలియజేస్తుంది.

### అత్యంత సులభంగా నియంత్రించవచ్చు..

ప్రతి రీడింగ్‌ను తేదీ, సమయంతోపాటు నమోదు చేసుకోవడం వల్ల వైద్యుడికి కూడా సరైన సమాచారం అందుతుంది. అవసరమైతే చికిత్స లేదా మందుల విషయంలో మరింత సరైన నిర్ణయం తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రక్తపోటుతో బాధపడుతున్న వారిలో చాలామందికి తమకు ఈ సమస్య ఉందనే విషయం కూడా తెలియదని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ గుండె జబ్బులకు దారితీసే ప్రమాద కారకాలలో అత్యంత సులభంగా నియంత్రించగలిగే అంశమని పేర్కొంటున్నారు. అయితే దాన్ని నియంత్రించాలంటే ముందుగా దానిని గుర్తించడం అవసరం. అందుకే రక్తపోటును క్రమం తప్పకుండా కొలుస్తూ, స్థాయిలపై అవగాహన కలిగి ఉండడం దీర్ఘకాలిక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారం ప్రమాదమో తెలుసా.. తెలియదంటే ఇప్పుడు తెలుసుకోండి..!




సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల ఆహారం పునాది లాంటిదని అందరికీ తెలుసు. అయితే మనం తీసుకునే ప్రతి ఆహారం అందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపదు. కొన్ని రకాల అనారోగ్య సమస్యలు (Health Issues) ఉన్నప్పుడు ఆరోగ్యకరమైనవిగా భావించే ఆహారపదార్థాలు కూడా హాని కలిగించవచ్చు. వ్యాధిని బట్టి ఆహార నియమాలను జాగ్రత్తగా పాటించడం చికిత్సలో ఒక కీలకమైన భాగంగా వైద్యులు సూచిస్తున్నారు. సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు. మరి ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారాలు తీసుకోకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారు స్వీట్లు, చక్కెర పానీయాలు, మైదా ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగవంతంగా పెంచుతాయి. అధిక రక్తపోటు బాధితులు ఉప్పు, ప్యాకేజ్డ్ స్నాక్స్, ఊరగాయలు వంటి సోడియం అధికంగా ఉండే పదార్థాలను మానుకోవాలి. లేదంటే శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు మరింత పెరిగే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు ఉన్నవారు డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇక కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు పాలకూర, రాగులు, జీడిపప్పు, డార్క్ చాక్లెట్ వంటివి తినకపోవడమే మంచిది. వీటిలోని ఉండే ఆక్సలేట్లు కాల్షియంతో కలిసి రాళ్ల ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు రెడ్ మీట్, కొన్ని రకాల సముద్ర చేపలు, మద్యానికి దూరంగా ఉండాలి. వీటిలోని ప్యూరిన్లు శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచి కీళ్ల నొప్పులు, వాపులకు దారితీస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు చక్కెర పానీయాలు, జంక్ ఫుడ్, మద్యపానాన్ని పూర్తిగా మానుకోవాలి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తాయి. గ్యాస్ట్రిక్, యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారు కారం, మసాలాలు, కాఫీ వంటివి తగ్గిస్తే ఉపశమనం లభిస్తుంది. హైపోథైరాయిడిజం సమస్య ఉన్నవారు గోయిట్రోజెన్లు ఉండే క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి ఆహారాలను వైద్యుల సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి. ఇవి థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి ఆహారం విషయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఏది తినాలో, ఏది తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఏవైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే, వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# రోజూ మనం వాడే టూత్‌పేస్టులతో క్యాన్సర్ వస్తుందా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రోజువారీగా ఉపయోగించే అనేక వస్తువులపై భయాలు, అపోహలు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. అలాంటి వాటిలో టూత్‌పేస్ట్ కూడా ఒకటి. టూత్‌పేస్ట్‌లో ఉండే కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమవుతుందనేది పూర్తిగా అపోహ మాత్రమేనని చెబుతున్నారు. ఈ అపోహకు కారణం ఒకేలా వినిపించే రెండు వేర్వేరు రసాయనాలను గందరగోళానికి గురి చేయడమేనని వివరిస్తున్నారు. చాలా టూత్‌పేస్ట్‌లలో సోడియం లారిల్ సల్ఫేట్ (Sodium Lauryl Sulphate -- SLS) అనే పదార్థం ఉంటుంది. ఇది టూత్‌పేస్ట్‌లో నురుగు ఏర్పడటానికి, దంతాలను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. అయితే కొందరు దీనిని సోడియం లారెత్ సల్ఫేట్ (Sodium Laureth Sulphate -- SLES)తో పొరపాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. SLES తయారీ ప్రక్రియలో ఏర్పడే కొన్ని ఉప ఉత్పత్తులు విషపూరిత ప్రభావాలకు సంబంధించిన చర్చల్లో ఉంటాయి. ఈ రెండు రసాయనాల పేర్లు ఒకేలా ఉండటంతోనే టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమనే అపోహ వ్యాపించిందని అంటున్నారు.



### క్యాన్సర ప్రమాదం ఉంటుందా..


SLS వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కొంతమందిలో ఇది నోటి లోపలి పొరను స్వల్పంగా చికాకు పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తరచూ నోటి పుండ్లు రావడం, నోటి లోపలి చర్మం అత్యంత సున్నితంగా ఉండటం లేదా దంతాలను తోమేటప్పుడు మంటగా అనిపించడం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. ఇలాంటి సమస్యలు ఎదురయ్యే వారు SLS లేని టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే అసౌకర్యం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి సున్నితత్వం లేని వారిలో SLS సాధారణంగా సురక్షితంగానే ఉంటుంది.

### పరిశ్రమల్లో వినియోగించినా..

కొంతమంది నానా పరిశ్రమల్లో కూడా ఉపయోగించే రసాయనం కాబట్టి అది ప్రమాదకరమని భావిస్తుంటారు. అయితే ఒక పదార్థాన్ని పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారనే కారణంతోనే అది మన ఆరోగ్యానికి హానికరమని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మనం ప్రతిరోజూ ఉపయోగించే నీరు కూడా అనేక పరిశ్రమల్లో వినియోగిస్తారని, కాబట్టి ఒక పదార్థం పారిశ్రామిక వినియోగంలో ఉందనే ఒక్క కారణంతో దానిని విషపూరితమని భావించడం సరైన విధానం కాదని పేర్కొంటున్నారు. అలాగే ప్రతి టూత్‌పేస్ట్ అందరికీ ఒకేలా సరిపోదని నిపుణులు చెబుతున్నారు. దంతాలు, చిగుళ్ల సున్నితత్వం, నోటి ఆరోగ్య పరిస్థితులను బట్టి టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవడం మంచిదని, అవసరమైతే దంతవైద్యుడి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ప్రసవానంతరం మహిళలు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి.. ఏయే సమస్యలు ఉంటాయి..?

ప్రసవం తర్వాత మహిళ శరీరం పూర్తిగా కోలుకోవడానికి, అలాగే శిశువుకు తల్లిపాలు అందించడానికి సరైన పోషకాహారం అత్యంత కీలకం. గర్భధారణ సమయంలో పోషకాహారంపై ఎంత శ్రద్ధ అవసరమో, ప్రసవానంతరం కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీర పునరుద్ధరణ వేగవంతమవడంతోపాటు శక్తి పెరుగుతుంది, తల్లిపాల ఉత్పత్తికి కూడా మేలు జరుగుతుంది. ప్రసవం తర్వాత శరీరం తీవ్రమైన శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ అయినా శరీరానికి కోలుకునే సమయం అవసరం. ఈ సమయంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణ, గాయాలు త్వరగా మానడం, శరీర కణజాలం మరమ్మత్తు కావడంలో సహాయపడుతుంది. గుడ్లు, పనీర్, పప్పులు, టోఫూ, చికెన్ వంటి ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం మంచిది.



### ఐరన్, క్యాల్షియం ఉండే ఆహారాలు..

ప్రసవ సమయంలో రక్తనష్టం జరగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే శరీరంలోని ఐరన్ నిల్వలను పునరుద్ధరించేందుకు పాలకూర, బీట్‌రూట్, బెల్లం, ఖర్జూరం, లీన్ మీట్ వంటి ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. దీంతో రక్తహీనత ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి కొవ్వులు (హెల్తీ ఫ్యాట్స్) కూడా ప్రసవానంతర పోషకాహారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. డ్రై ఫ్రూట్స్, గింజలు, విత్తనాలు వంటి ఆహారాల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా హార్మోన్ల సమతుల్యతకు కూడా తోడ్పడతాయి. అలాగే ఎముకల ఆరోగ్యానికి పెరుగు, పాలు, నువ్వులు, రాగి వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ప్రసవం తర్వాత, ముఖ్యంగా తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తగినంత నీరు తాగడం చాలా అవసరం. శరీరంలో ప్రతి కణం సక్రమంగా పనిచేయడానికి, జీర్ణక్రియ మెరుగుపడడానికి, తల్లిపాల ఉత్పత్తి సక్రమంగా సాగడానికి హైడ్రేషన్ కీలకం. రోజుకు సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. సాధారణ నీటితోపాటు కొబ్బరి నీరు, మజ్జిగ, చికెన్ సూప్, పప్పు సూప్ వంటి పోషక విలువలు కలిగిన ద్రవాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు.

### తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు..

ప్రసవానంతరం రోజుకు మూడు పెద్ద భోజనాల కంటే తక్కువ మోతాదులో తరచూ ఆహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరానికి నిరంతరం శక్తి అందుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా తగ్గిపోవడాన్ని నివారించవచ్చు. దీంతో ప్రసవానంతర అలసట కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ప్రాసెస్ చేసిన స్నాక్స్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక కాఫీ, మద్యం వంటి వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. వీటి బదులుగా తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. సాంప్రదాయ ఆహారాల్లో అజ్వైన్ (వాము), మెంతులు, జీలకర్ర, గోండ్ వంటి పదార్థాలు కూడా ప్రసవానంతర కాలంలో ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు కడుపు ఉబ్బరం తగ్గించడంలో సహాయపడతాయి. గోండ్ లడ్డూలు, వాము నీరు, మెంతులతో చేసిన వంటకాలు ప్రసవం తర్వాత కోలుకునే ప్రక్రియకు తోడ్పడతాయి.

# ఫ్లెమింగ్ ఎగ్జిట్.. సీఎస్కేకు కొత్త కోచ్ ఎవరు? తెరపైకి ధోనీ పేరును తీసుకొచ్చిన అశ్విన్!




చెన్నై సూపర్ కింగ్స్ తో సుదీర్ఘకాలం పాటు కొనసాగిన హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రస్థానం ముగియడంతో, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఎల్లో ఆర్మీలో సరికొత్త చర్చ మొదలైంది. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన ఫ్లెమింగ్, సీఎస్కే యాజమాన్యం పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో జట్టుకు కొత్త హెడ్ కోచ్‌గా ఎవరు వస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**ధోనీయే పర్ఫెక్ట్ ఛాయిస్:**

సిఎస్కే జట్టుతో ఎంఎస్ ధోనీకి అపారమైన అనుభవం ఉందని రవిచంద్రన్ అశ్విన్ తెలిపారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేయడానికి ధోనీ కంటే ఉత్తమమైన వ్యక్తి మరొకరు లేరని తేల్చి చెప్పాడు. చెన్నై ఫ్రాంచైజీలో ధోనీకి తిరుగులేని ఇమేజ్, టీమ్ సెలక్షన్, కీలక నిర్ణయాల్లో అతనికున్న పట్టు దృష్ట్యా కొత్తగా వచ్చే ఏ కోచ్‌కైనా ఒత్తిడి తప్పదన్నాడు. గత 17 ఏళ్లుగా ఫ్లెమింగ్–ధోనీ జోడి ఎంతో విజయవంతంగా సాగింది. ధోనీ మైండ్ సెట్‌ను ఫ్లెమింగ్ కరెక్ట్‌గా అర్థం చేసుకునేవాడు. ఇక ధోనీ గనుక కోచ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటే, సీఎస్కే మేనేజ్‌మెంట్ ఏమాత్రం ఆలోచించకుండా అతనికే పట్టం కట్టాలి.. ఒకవేళ ధోనీ కాదనుకుంటే, అతని ఇన్ఫ్లుయెన్స్‌కు లొంగకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల ధీటైన వ్యక్తిని వెతకాలని ఆర్. అశ్విన్ వెల్లడించాడు.

**రేసులో హేమంగ్ బదానీ:**

ప్రస్తుతం స్టీఫెన్ ఫ్లెమింగ్ వారసుడిగా మాజీ భారత బ్యాటర్ హేమంగ్ బదానీ పేరు క్రికెట్ సర్కిల్స్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కు హెడ్ కోచ్‌గా సేవలందిస్తున్న బదానీ వైపు సీఎస్కే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. అయితే, బదానీ కోచింగ్, అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ క్యాపిటల్స్ 2025లో 5వ స్థానం, అలాగే ఐపీఎల్ 2026లో 6వ స్థానంతో సరిపెట్టుకుంది. సీఎస్కే మళ్లీ తన పూర్వ వైభవాన్ని అందుకోవాలని చూస్తున్న తరుణంలో, బదానీ రీసెంట్ ట్రాక్ రికార్డును యాజమాన్యం ఎంత వరకు పరిగణనలోకి తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

**ముగిసిన ఫ్లెమింగ్ అద్భుతమైన లెగసీ:**

2008లో ఆటగాడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, 2009 నుంచి సీఎస్కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రస్థానం నిజంగా ఒక స్వర్ణ యుగం (+శీశ్రీఎవఅ జుతీఝ) అని చెప్పాలి.. 17 ఏళ్ల సుదీర్ఘ కోచింగ్ కెరీర్‌లో చెన్నైని ఐపీఎల్ చరిత్రలోనే మోస్ట్ కన్సిస్టెంట్ టీమ్‌గా నిలబెట్టాడు.

టైటిల్స్ రికార్డు: ఫ్లెమింగ్ ఆధ్వర్యంలో సీఎస్కే ఏకంగా 5 ఐపీఎల్ ట్రోఫీలు, 2 ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను గెలుచుకుంది.

ప్లేఆఫ్స్ రికార్డు: రికార్డు స్థాయిలో 12 సార్లు ప్లేఆఫ్స్‌కు చేర్చడమే కాకుండా, 10 సార్లు ఐపీఎల్ ఫైనల్స్ ఆడించిన ఘనత ఫ్లెమింగ్ దే.

ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ లో ఒక సరికొత్త రీబిల్డింగ్ ఫేజ్ (=వఎబఱశ్రీఎఱఅస్త్రూష్ఠుంవ) స్టార్ట్ కాబోతోంది. మరి ఈ నయా ఎరాను లీడ్ చేయడానికి ధోనీ పగ్గాలు అందుకుంటాడా, లేక సరికొత్త కోచ్ ఎంట్రీ ఇస్తాడా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

# విరాట్ కోహ్లీ సక్సెస్ రహస్యం అదే.. ఆసక్తికర విషయం చెప్పిన అభిషేక్ నాయర్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అపారమైన విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం, తన ఆట పద్ధతులపై అతనికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సమయంలో జరిగిన ఒక సంభాషణను గుర్తుచేసుకుంటూ, కోహ్లీ మైండ్‌సెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ నాయర్ ఈ విషయాలను పంచుకున్నాడు.

కొన్నేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ వరుసగా రెండుసార్లు డకౌట్ అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పుడే తాను భారత జట్టు సహాయక కోచ్ పదవి నుంచి తప్పుకున్నానని, అయినా కోహ్లీతో టచ్‌లో ఉన్నానని నాయర్ తెలిపాడు. "ఆ సమయంలో నేను కోహ్లీకి ఫోన్ చేసి, అంతా బాగానే ఉందా? ఏమైనా మాట్లాడాలనుకుంటున్నావా? అని అడిగాను. దానికి కోహ్లీ చాలా ప్రశాంతంగా 'అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే' అని సమాధానమిచ్చాడు" అని నాయర్ చెప్పాడు.ఆ తర్వాత తాను ఒక టెక్నికల్ విషయాన్ని గమనించానని, దాని గురించి చెప్పాలనుకుంటున్నానని కోహ్లీ అనుమతి కోరానని నాయర్ తెలిపాడు. "నేను 'ఒక విషయం గమనించాను. వింటావా?' అని అడిగాను. దానికి అతను నవ్వుతూ 'వద్దు, నేను నా పద్ధతిలోనే చేస్తాను' అని సున్నితంగా తిరస్కరించాడు. నాకు నవ్వొచ్చింది. ఆ తర్వాతి మ్యాచ్ అనంతరం నాకు అతడి నుంచి 'నేను నా పద్ధతిలోనే చేశాను' అనే సమాధానం వచ్చింది" అని నాయర్ ఆ సంభాషణను వివరించాడు.

ఈ ఒక్క సంఘటన విరాట్ కోహ్లీ ఎంతటి గొప్ప ఆటగాడో చెబుతుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. "నా దృష్టిలో విరాట్ కోహ్లీ గొప్పతనానికి ఇదే నిదర్శనం. కఠిన సమయాల్లో ఎలా ఆడాలో గొప్ప ఆటగాళ్లకు బాగా తెలుసు. మనం విశ్లేషించగలం, ఊహించగలం. కానీ, వాళ్లు అంతర్జాతీయ స్థాయిలో పదేపదే రాణించి నిరూపించుకున్నారు. అందుకే విరాట్, రోహిత్ వంటి ఆటగాళ్లంటే నాకు అపారమైన గౌరవం" అని నాయర్ తెలిపాడు. తమ మీద తమకు ఉన్న ఈ నమ్మకమే వారిని మిగతా ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.

# భారత పేసర్ గుర్నూర్ బ్రార్‌కు డీమెరిట్ పాయింట్.. ఐసీసీ సీరియస్ వార్నింగ్!

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద ఒక డీమెరిట్ పాయింట్ నమోదు

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో బ్యాటర్ వైపు బంతి విసిరిన ఘటన

తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

రెండేళ్ల కాలంలో గుర్నూర్‌కు ఇదే తొలి తప్పిదం




భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ సింగ్ బ్రార్‌పై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడికి అధికారికంగా హెచ్చరిక జారీ చేయడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మేరకు ఐసీసీ నేడు ఒక ప్రకటన విడుదల చేసింది.వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 8వ ఓవర్లో బౌలింగ్ చేస్తున్న గుర్నూర్ బ్రార్, బంతిని అందుకుని బ్యాటర్ వైపు అనుచితంగా, ప్రమాదకరంగా విసిరాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. 'అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారుడిపై లేదా సమీపంలోకి అనుచితంగా, ప్రమాదకరంగా బంతిని విసరడం' ఈ నిబంధన పరిధిలోకి వస్తుంది.ఈ ఆరోపణలను ఆన్‌ఫీల్డ్ అంపైర్లు కుమార్ ధర్మసేన, మైక్ బర్న్స్, థర్డ్ అంపైర్ శామ్ నొగాజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ రస్సెల్ వారెన్ మోపారు. అయితే, గుర్నూర్ బ్రార్ తన తప్పును అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ప్రతిపాదించిన శిక్షకు అంగీకారం తెలపడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే శిక్షను ఖరారు చేశారు. గత 24 నెలల కాలంలో గుర్నూర్‌కు ఇదే మొదటి తప్పిదం కావడం

గమనార్హం.లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరిక నుంచి ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడి ఖాతాలో 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే, వాటిని సస్పెన్షన్ పాయింట్లుగా మార్చి నిషేధం విధిస్తారు. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఒక టెస్టు లేదా రెండు వన్డేలు/టీ20ల నిషేధానికి సమానం. కాగా, ఈ సిరీస్‌లో తొలి వన్డేను 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్ 1–0 ఆధిక్యంలో ఉంది. నేడు కార్డిఫ్‌లో ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరగనుంది.



సీరత్ కపూర్ సిల్క్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

# చరణ్ 'పెద్ది'.. మేకర్స్ నిర్ణయం కలిసొచ్చినట్లుందే..



థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న సినిమాలు ఓటీటీలో కూడా అదే రేంజ్ రెస్పాన్స్ ను అందుకోవడం రేర్. అయితే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత నెట్ ఫ్లిక్స్ లోకి వచ్చిన ఆ సినిమా, అక్కడ కూడా మంచి వ్యూయర్ షిప్ తో దూసుకెళ్తోంది. ముఖ్యంగా ఓటీటీ కోసం కొన్ని కొత్త సీన్స్ యాడ్ చేయాలన్న మేకర్స్ నిర్ణయం సినిమాకు అట్రాక్షన్ గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన ఆ స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్టైనర్ థియేటర్లలో ఇప్పటికే భారీ వసూళ్లు సాధించి విజయాన్ని నమోదు చేసింది. ఆ సక్సెస్ కు కొనసాగింపుగా జూలై 9 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత కూడా సినిమాకు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. థియేటర్లలో చూసిన ప్రేక్షకులే మరోసారి ఓటీటీలో సినిమా చూడటం విశేషంగా మారింది.దీనికి ప్రధాన కారణంగా ఓటీటీ వెర్షన్ లో యాడ్ చేసిన ఎక్స్ ట్రా సీన్స్ అని తెలుస్తోంది. థియేటర్లలో లేని కొన్ని ఎమోషనల్, డ్రామాటిక్ మూమెంట్స్ ను ఓటీటీ కట్ లో చేర్చడంతో ఇప్పటికే సినిమా చూసిన వారిలో కూడా మళ్లీ ఆసక్తి పెరిగింది. అదే సమయంలో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు కూడా ఇప్పుడు ఆ సినిమాను పెద్ద ఎత్తున చూస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా పెద్దిపై పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది.ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలపై మళ్లీ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కథను దర్శకుడు మలిచిన తీరు, ఓటీటీ వెర్షన్ లో కనిపించిన కొత్త సీన్స్ సినిమాపై చర్చను మరింత పెంచాయి. డిజిటల్ ప్లాట్ ఫామ్ లో తొలి వారంలోనే పెద్దికి సుమారు 1.9 మిలియన్ వ్యూస్ వచ్చినట్లు సమాచారం. అదే సమయంలో భారత్ లో నెట్ ఫ్లిక్స్ ట్రెండింగ్ జాబితాలో టాప్ 10లో ఉండడం విశేషం.

మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. ప్రస్తుతం పెద్ది మూవీ సౌత్ లాంగ్వేజ్ లో మాత్రమే అందుబాటులో ఉండగా, హిందీ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది. హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ ప్రారంభమైన తర్వాత వ్యూయర్ షిప్ మరింత పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. సినిమా థియేటర్లలో విజయవంతమైతే ఓటీటీలో కూడా అదే కట్ విడుదల చేయడం కామన్. కానీ పెద్ది విషయంలో మాత్రం ప్రేక్షకులకు కొత్త ఎక్స్పీరియన్స్ కలిగించేలా కొత్త సీన్స్ యాడ్ చేయడం మేకర్స్ తీసుకున్న తెలివైన నిర్ణయంగా కనిపిస్తోంది.అదే ఇప్పుడు మరోసారి సినిమాపై ఆసక్తిని పెంచి, డిజిటల్ ప్లాట్ ఫామ్ పై కూడా మంచి రిజల్ట్స్ తీసుకొస్తోంది. ఇప్పటికే థియేటర్లలో సత్తా చాటిన పెద్ది.. ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. రానున్న వారాల్లో ఆ సినిమా వ్యూయర్ షిప్ మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తుందా? లేదా అనే ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది. ప్రస్తుతం ట్రెండ్ చూస్తే.. మేకర్స్ తీసుకున్న చిన్న నిర్ణయం సినిమాకు మరో విజయాన్ని అందించినట్లే కనిపిస్తోంది.



సాక్షి మాలిక్ అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965